ప్రజాశక్తి

సోమవారం 20 మే 2024

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

మహనీయుడు సుందరయ్య

- భావితరాలకు ఆయన మార్గదర్శి
- వర్ధంతి సభలో పలువురు వక్తల ఉద్ఘాటన
- అల్లూరి విజ్ఞాన కేంద్రంలో 'మతోన్మాదం-రాజ్యాంగం-ప్రస్తుత సవాళ్లు'పై స్మారకోపన్యాసం

సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేస్తున్న వి.శ్రీనివాసరావు, అజశర్మ

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో, ఎంవిపి.కాలనీ విలేకరి

పేదల పెన్నిధి, ఆదర్శ నేత పుచ్చలపల్లి సుందరయ్య మార్గం అనుసరణీయమని పలువురు వక్తలు పిలుపు నిచ్చారు. భావితరాలకు ఆయన మార్గదర్శి అని ఉద్ఘాటించారు. ఆయన స్ఫూర్తితో రాజ్యాంగ పరిరక్షణకు పాటుపడాలన్నారు. ఆదివారం ఉదయం విశాఖ డాబాగార్డెన్స్‌లోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో ప్రముఖ కమ్యూనిస్టు యోధుడు పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతి సభ నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు 'మతోన్మాదం - రాజ్యాంగం - ప్రస్తుత సవాళ్లు' అన్న అంశంపై స్మారకోపన్యాసం చేశారు. లౌకికవాదం, సామాజిక న్యాయానికి విఘాతం కలిగిస్తూ దేశంలో ప్రధాని మోడీ పదేళ్లుగా పాలన సాగిస్తున్నారని గుర్తు చేశారు. ఈ క్రమంలో నేటి యువతరానికి సుందరయ్య జీవిత ఆదర్శాలు, ఆయన చేసిన రచనలు ఎంతో అవసరమని నొక్కి చెప్పారు. సుందరయ్యకు నిజమైన నివాళి అంటే రాజ్యాంగ హక్కుల రక్షణ, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణకు పాటుపడటమేనన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ మాట్లాడుతూ భారతదేశం లౌకిక రాజ్యమని రాజ్యాంగంలో పొందుపరచబడిందన్నారు. నేడు రాజ్యాంగంపై కేంద్ర బిజెపి ప్రభుత్వం దాడి చేస్తోందన్నారు. దర్యాప్తు సంస్థలను సైతం తమ ఆధీనంలో పెట్టుకొని ఆడిస్తోందన్నారు. రాజ్యాంగానికి ప్రమాదం వస్తే రక్షించాల్సిన రెండే రెండు వ్యవస్థలు న్యాయ వ్యవస్థ, మీడియా అని పేర్కొన్నారు. ఇందిరాగాంధీ ప్రధానిగా ఉన్న సమయంలో ఎమర్జెన్సీ వచ్చి రాజ్యాంగానికి ప్రమాదం ఏర్పడిన సమయంలో న్యాయ వ్యవస్థ, మీడియా కలిసి దేశాన్ని రక్షించాయని తెలిపారు. గతంలో భారత రాజ్యాంగానికి ప్రమాదం ఏర్పడిన సమయంలో సుప్రీంకోర్టు వ్యవహరించిన తీరును గుర్తుచేశారు. నేడు మోడీ రాజ్యాంగాన్ని మిగతా 2లో..

ఆర్‌కె బీచ్‌కు పోటెత్తిన నగరవాసులు

జన సాగరం

విశాఖ సాగర తీరానికి ఆదివారం జనం పోటెత్తారు. ఇటీవల కాలంలో ఎప్పుడూ లేనంత మంది ఈసారి కనిపించారు. సముద్ర స్నానాలు చేస్తూ వేసవి తాపం నుంచి ఉపశమనం పొందారు. అసలే ఆదివారం కావడం, సెలవు దొరకడంతో పెద్దలు పిల్లలను తీసుకుని ఆర్‌కె బీచ్, జోడుగుళ్లపాలెం, సాగర్ నగర్ బీచ్‌లకు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఇక పర్యాటకులూ మునుపెన్నడూ లేనంతగా రావడంతో తీరం జనసంద్రమైంది.

ఘనంగా ఎర్నిమాంబ జాతర

వార్త 2లో..

2న మేనేజ్‌మెంట్ ఆప్టిట్యూడ్ టెస్ట్

వార్త 2లో..

పోలీసుల అప్రమత్తత అవసరం : ఎస్‌పి

వార్త 6లో..

దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న తౌడన్న

ప్రభుత్వ రంగాన్ని రక్షించుకుందాం

స్టీల్ ఎస్‌సి, ఎస్‌టి ఎంప్లాయీస్ అసోసియేషన్

వార్త మెయిన్‌లో..

వెలవెలబోతున్న థియేటర్లు

- నెల రోజులుగా ఖాళీగానే దర్శనం
- విశాఖలో ఎన్నడూ లేనంత గడ్డు పరిస్థితి
- కొత్త సినిమాలు లేకపోవడమే కారణమంటున్న సినీ ప్రియులు

నగరంలోని ఓ సినిమా థియేటర్ లోపలి భాగం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖ నగరంలో ఎన్నడూ లేనంత గడ్డు పరిస్థితిని సినిమా థియేటర్లు ఎదుర్కొంటున్నాయి. ప్రేక్షకులు రాక వెలవెలబోతున్నాయి. వాస్తవానికి నగరంలోని దాదాపు అన్ని థియేటర్లూ ఎసి సౌకర్యం కలిగినవే. మండువేసవిలో వీటి ఆక్యుపెన్సీ బాగానే ఉండాలి. అయితే దాదాపు నెల రోజులుగా థియేటర్లు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. దీనికి ప్రధాన కారణం కొత్త సినిమాలు, పెద్ద హీరోల చిత్రాలు విడుదల కాకపోవడమేనని పలువురు చెబుతున్నారు. రెండు దశాబ్దాల క్రితం కొత్త సినిమాలు విడుదలకాని పరిస్థితుల్లో.. గతంలో విడుదల కాబడి, హిట్టు చిత్రాలుగా పేరుపొందిన వాటిని రీ రిలీజ్ చేసేవారు. అయితే ఆ తర్వాత ఈ విధానానికి ఫుల్ స్టాప్ పడింది. పాత సినిమాలు మళ్లీ మళ్లీ వేయటం జరగటం లేదు. కొత్త సినిమాలు మాత్రమే విడుదల కావాలి, అవి మాత్రమే ప్రదర్శింపబడాలి. లేకుంటే ప్రేక్షకులు థియేటర్ల వైపు కన్నెత్తి చూడని పరిస్థితి 20 ఏళ్లుగా ఉంది. మూడు, నాలుగు దశాబ్దాల క్రితం విడుదల కాబడ్డ సినిమా సూపర్ డూపర్ హిట్ అయితే వంద రోజులు, 200 రోజులు, కొన్నయితే ఏడాది పాటు కూడా ప్రదర్శింపబడిన సందర్భాలు ఉండేవి. అందుకే అప్పట్లో సినీ హీరోల అభిమానులు తమ హీరో చిత్రం అన్ని రోజులు, ఇన్ని రోజులు ప్రదర్శించబడిందని, కలెక్షన్ల వర్షం కురిపించిందని గొప్పగా చెప్పుకునేవారు. దరిమిలా ఆ పరిస్థితి మారింది. చిత్రం ఎన్ని రోజులు ప్రదర్శింపబడింది అనేది కాకుండా.. ప్రదర్శింపబడిన మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

మహనీయుడు సుందరయ్య

కాపాడాల్సిన రెండు వ్యవస్థలనూ తన ఆధీనంలో పెట్టుకున్నారన్నారు. మీడియా మొత్తం కార్పొరేట్ల ఆధీనంలోకి వెళ్లిపోయిందని అన్నారు. 2018లో ఎన్నికల బాండ్లపై కోర్టులో పిటిషన్ వేస్తే బిజెపి పొందాల్సిన లబ్ధినంతా పొందిన తర్వాత 2024లో కోర్టు తీర్పునిచ్చిందన్నారు. ఈ మధ్య కాలంలో సుప్రీంకోర్టు దేశంలో చాలా దురాగతాలను ప్రోత్సహించే విధంగా తీర్పులిచ్చిందన్నారు. నేడు అప్పుడప్పుడూ మాత్రమే ఒకటి రెండు మంచి తీర్పులు వస్తున్నాయన్నారు. నేటి పరిస్థితుల్లో రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలపైనే ఉందన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన అల్లూరి విజ్ఞాన కేంద్రం కార్యదర్శి డాక్టర్ బి.గంగారావు మాట్లాడుతూ రెండేళ్ల క్రితం అల్లూరి విజ్ఞాన కేంద్రాన్ని ఇదే రోజున ప్రారంభించామన్నారు. సామాజిక తరగతులను సమీకరించే కేంద్రంగా ఇది రూపుదిద్దుకుంటోందన్నారు. కార్యక్రమంలో సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్‌కెఎస్‌వి.కుమార్, బొట్టా ఈశ్వరమ్మ, బి.జగన్, నాయకులు రెడ్డి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు. తొలుత సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లర్పించారు. ప్రజానాట్య మండలి కళాకారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

వెలవెలబోతున్న థియేటర్లు

రోజులు తక్కువగా ఉన్నప్పటికీ కలెక్షన్ల పరంగా వసూళ్లు ఏ రేంజ్‌లో ఉన్నాయో చెప్పడం ప్రారంభమైంది. కలెక్షన్లు అధికంగా రావాలంటే ఎక్కువ థియేటర్లలో సినిమా రిలీజ్ కావడం, అది కూడా పెద్ద హీరో చిత్రం కావడం ఉంటేనే సాధ్యపడుతుంది. అతికొద్ది మంచి చిత్రాలకు దీనిని మినహాయించవచ్చు. అయితే ప్రస్తుతం థియేటర్లకు ప్రేక్షకులు కరువు కావడానికి ఏకైక కారణం కొత్త సినిమాలు ఆశించిన స్థాయిలో విడుదల కాకపోవడమేనని తెలుస్తోంది. థియేటర్లలో ఈసరికే నడుస్తున్న చిత్రం బాగా లేనప్పటికీ థియేటర్ నడవాలి కాబట్టి కలెక్షన్‌తో సంబంధం లేకుండా అదే సినిమాను ప్రదర్శనకు కొనసాగించే పరిస్థితి నెలకొంది. ఇది కేవలం విశాఖ నగరానికి సంబంధించినది మాత్రమే కాదు.. తెలుగు సినిమా రంగానికంతటికీ ఇబ్బందిగా మారింది.

నష్టాలతో మూత

పొరుగున ఉన్న తెలంగాణా రాష్ట్రంలో కొత్త సినిమాలు రిలీజ్ కానందున, థియేటర్లకు కలెక్షన్లు లేని కారణంగా, నష్టాలతో నడపడం ఇబ్బందికరంగా మారడంతో పది రోజులు పాటు సింగిల్ స్క్రీన్ థియేటర్లను మూసివేస్తూ అక్కడి ఎగ్జిబిటర్లు నిర్ణయం తీసుకున్నారు. అమలు జరుపుతున్నారు. విశాఖ నగరంలో కూడా ఈ పరిస్థితి వచ్చినా రావచ్చు. నిజానికి టీవీలు వగైరా మాధ్యమాలు రావడంతో సినిమా థియేటర్ల కలెక్షన్లు దాదాపు మందగించాయి. మూడు నాలుగు దశాబ్దాల క్రితం థియేటర్లు లాభాల్లో నడిచేవి. ఆ తర్వాత నుంచి నష్టాల బాట పట్టాయి. ఇప్పుడు నష్టాలు పీకల లోతుకు చేరాయి. అందుకే అనేకమంది ఎగ్జిబిటర్లు తమ థియేటర్లను మూసివేశారు. కొన్ని థియేటర్లు కల్యాణ మండపాలుగా, వాణిజ్య భవనాలుగా రూపు చెందాయి. కొద్ది మాసాల క్రితం గోపాలపట్నంలోని శంకర, సత్యం థియేటర్లను పూర్తిగా మూసివేశారు. ఇదే పరిస్థితి మరికొన్ని ప్రాంతాల్లో కూడా ఉంది. నగర పరిధిలో 40 వరకు థియేటర్లు ఉన్నాయి. అటు అనకాపల్లి, ఇటు భీమిలి కలుపుకుంటే గ్రేటర్ విశాఖ పరిధిలో వీటి సంఖ్య 45 వరకు ఉంటుంది. ఒకప్పుడు ఇదే ప్రాంతంలో సుమారు 60 నుంచి 70 థియేటర్లు ఉండేవి. విశాఖ నగర పరిధిలో గతంలో పూర్ణా మార్కెట్ వద్ద ఉండే పూర్ణా థియేటర్, ప్రభాత్, పాత నగరంలోని శ్రీ లక్ష్మీ టాకీస్, డాల్ఫిన్ జంక్షన్‌కు సమీపంలోని గీత్, సంగీత్, ఇదే ప్రాంతంలోని పురాతన సరస్వతి థియేటర్, వీటికి కాస్త దూరంలో ఉండే శ్రీ రామకృష్ణ థియేటర్, దానికి కొన్ని వందల అడుగుల దూరంలో ఉండే సత్యనారాయణ థియేటర్, ప్రస్తుతం ఉన్న చిత్రాలయ థియేటర్‌కు ఎదురుగా ఉన్న రోడ్డులో ఉండే రెండు థియేటర్లు మూతపడ్డాయి. ఈ రెండు థియేటర్లు ఉన్న ప్రదేశంలో ఇప్పుడు డీమార్ట్ నడుస్తోంది.

2న మేనేజ్‌మెంట్ ఆప్టిట్యూడ్ టెస్ట్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఎంబిఎ, పిజిడిఎం ప్రోగ్రామ్‌లలో ప్రవేశాల కోసం ఆల్ ఇండియా మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (ఎఐఎంఎ) ఆధ్వర్యంలో జరగనున్న మేనేజ్‌మెంట్ ఆప్టిట్యూడ్ టెస్ట్‌కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ టెస్ట్ విశాఖలో జూన్ 2న జరగనుందని ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యర్థులు ఈ నెల 28లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఏదైనా విభాగంలో గ్రాడ్యుయేట్, గ్రాడ్యుయేట్ చివరి సంవత్సరం విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. దరఖాస్తు రుసుం రూ.2100 చెల్లించవలసి ఉంటుందన్నారు. ఈ పరీక్ష కంటెంట్ ఫోకస్ సహా వివిధ అంశాలను కలిగి ఉంటుందని, 120 నిమిషాల్లో 150 ప్రశ్నలతో కూడిన స్ట్రీమ్‌లైన్డ్ ఎగ్జామ్ స్ట్రక్చర్ అభ్యర్థులకు మరింత సమర్థవంతమైన పరీక్షా అనుభవాన్ని అందిస్తుందని అన్నారు. అభ్యర్థులు తమకు అనుకూలమైన వై మోడ్‌ను ఎంచుకోవచ్చని, https://mat.aima.inలో వివరాలు నమోదులో చేసుకోవాలని తెలిపారు.

ఘనంగా ఎర్నిమాంబ జాతర

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : దక్షిణ నియోజకవర్గం 44వ వార్డు జ్ఞానాపురం కాన్వెంట్ జంక్షన్‌లో ప్రసిద్ధి చెందిన శ్రీ ఎర్నిమాంబ అమ్మవారి జాతర మహోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. తెల్లవారుజాము నుంచే భక్తులు వందలాది మంది తరలివచ్చి, ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారిని దర్శించుకున్నారు. దక్షిణ ఎమ్మెల్యే, వైసిపి అసెంబ్లీ అభ్యర్థి వాసుపల్లి గణేష్ కుమార్, అలాగే దక్షిణ జనసేన అభ్యర్థి వంశీకృష్ణ శ్రీనివాస్‌లు వచ్చి ఎర్నిమాంబ అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా గణేష్ కుమార్ మాట్లాడుతూ ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని ఆకాంక్షించారు. జాతర సందర్భంగా సర్వాంగ సుందరంగా ఆలయాన్ని తీర్చిదిద్దారని, విద్యుత్ అలంకరణలతో జ్ఞానాపురం ప్రాంతం అంతా భక్తులతో సౌభాగ్యమానంగా వెలుగుతోందని ఆనందం వ్యక్తపరిచారు. దక్షిణ నియోజకవర్గంలోని ప్రముఖ దేవాలయాలలో ఇర్నిమాంబ ఆలయం ఒకటి అన్నారు. భక్తులకు మరెన్నో సౌకర్యాలు అందేలా ఆలయం అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.

రూ.కోట్లతో పునరుద్ధరించిన

టౌన్ హాల్ మళ్లీ శిథిలావస్థకు చేరుతోందా..?

నిర్వహణా లోపంతో చారిత్రక కట్టడానికి ముప్పు

పాత నగరంలోని టౌన్ హాల్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్

రూ.కోట్లతో పునరుద్ధరించబడిన టౌన్ హాల్ మళ్లీ శిథిలావస్థకు చేరుతోందా ? అంటే అవుననే సమాధానమే వినిపిస్తోంది. ఇప్పటికైనా దీని నిర్వహణపై మరింత దృష్టి పెట్టాలని పలువురు కోరుతున్నారు. విశాఖ కీర్తి శిగలో చారిత్రక కట్టడాలు ఎన్నో ఉన్నాయి. ఈ కట్టడాలు విశాఖకు వన్నె తెచ్చాయి శతాబ్దాల క్రితం నిర్మించినవే అయినప్పటికీ నేటికీ చెక్కు చెదరకుండా అబ్బుర పరుస్తున్నాయి. ఒక విధంగా చెప్పాలంటే నాటి నైపుణ్యానికి ప్రభావానికి ప్రతీకలుగా నిలుస్తున్నాయి. కలెక్టరేట్, కెజిహెచ్, ఆంధ్ర విశ్వ కళాపరిషత్, ఎవిఎన్, క్వీన్ మేరీ స్కూల్, కమిషనరేట్, జడ్జి కోర్టులు, ఆంధ్ర మెడికల్ కళాశాలలు చరిత్రకు ఆనవాళ్లుగా బాసిల్లుతూ నగరంలో మనకు కనిపిస్తున్నాయి. అయితే ఇటువంటి చారిత్రక ప్రసిద్ధి చెందిన మరొక రెండు కట్టడాలు పాత నగరంలో ఉన్నాయి. వాటిలో ఒకటి టౌన్ హాల్ కాగా, మరొకటి పాత మున్సిపల్ కార్యాలయ భవనం. టౌన్ హాల్, పాత మున్సిపల్ కార్యాలయ భవనాలు ఎక్కడ ఉన్నాయి అనేది సంబంధిత అధికారులకు, పాత నగరం ప్రజలకు మాత్రమే తెలుస్తుంది. దాదాపు 90 శాతం మంది ప్రజలకు ఇవి రెండు చారిత్రక కట్టడాలు ఎక్కడ ఉన్నాయో కూడా తెలియదంటే ఆశ్చర్యం కలగక మానదు.

ఇక టౌన్ హాలు గురించి చెప్పాలంటే ఎంతో చరిత్ర ఉంది. భారతదేశ స్వాతంత్ర్య పోరాటంలో విశాఖపట్నం నుంచి పాల్గొన్న అనేకమంది పోరాట యోధులు, మేధావులు, కవులు నిత్యం టౌన్ హాలులోనే సమావేశాలు జరుపుకునేవారు. మహాత్మా గాంధీతో సహా అనేకమంది ప్రముఖులు టౌన్ హాల్ వేదికగా స్వాతంత్ర్య స్ఫూర్తిని ప్రజలలో రగిలించడానికి కషి చేశారు. మహాకవి శ్రీశ్రీ, పురిపండ అప్పలస్వామి, ఆరుద్ర వంటి మహాకవులు టౌన్ హాలు వేదికగా అనేక సాహిత్య కార్యక్రమాలను నిర్వహించారు. ఎంఎస్. సుబ్బలక్ష్మి, ద్వారం వెంకటస్వామి నాయుడు వంటి సంగీత విద్వాంసులు వారి ప్రతిభను ఇదే భవనంలో ప్రదర్శించి నాటి సంగీత ప్రియులను అలరించారు. ఇతర ప్రముఖులు సి.రాజగోపాలాచారి, సర్వేపల్లి రాధాకృష్ణన్, సివి.రామన్, రవీంద్రనాథ్ ఠాకూర్ వంటి వారు టౌన్ హాలులో ఉపన్యాసాలు అందించారు. ఇంతటి ప్రాధాన్యత కలిగిన టౌన్‌హాల్ దాదాపు రెండు దశాబ్దాలుగా శిథిలావస్థకు చేరింది. ఇదే భవనాన్ని ఆనుకొని పాత మున్సిపల్ కార్యాలయ భవనం కూడా ఉంది. ఇది కూడా ఒక చారిత్రక భవనమే. చారిత్రక వారసత్వ భవనాలగా గుర్తింపు పొందిన వీటి నిర్మాణం ఎంతో పురాతనమైనది, విశిష్టమైనది కూడా. టౌన్ హాలును 1904 మార్చి 8న అప్పటి జిల్లా కలెక్టర్ ఆర్‌హెచ్ క్యాంబెల్ ప్రారంభించారు.

ఇక పాత మున్సిపల్ భవనం 1931లో నిర్మించబడింది. విశాఖపట్నం మున్సిపాలిటీ ఎంతో పురాతనమైన వాటిలో ఒకటి. 1858లో పనిచేయడం ప్రారంభించింది. పట్టణం విస్తరణతో కొత్త భవనం అవసరం ఏర్పడింది. ఈ నేపథ్యంలో టౌన్ హాల్‌ను అనుకొని నిర్మించిన భవనంలోకి మున్సిపల్ కార్యాలయాన్ని మార్పు చేశారు. అప్పటినుంచి ఇది మున్సిపల్ కార్యాలయ భవనంగా గుర్తింపు పొందింది. బ్రిటిష్ కాలంలో నిర్మించిన తొలి మున్సిపల్ కార్యాలయ భవనం ఇదే. ఇంతటి ప్రాధాన్యత కలిగిన ఈ భవనాలు ఆ తర్వాత శిథిలావస్థకు చేరాయి. అయితే వీటిని చారిత్రక భవనాలుగా గుర్తించి జివిఎంసి వీటి పునరుద్ధరణకు నడిపించింది. 2020లో ఈ రెండు భవనాలను సుమారు రూ.15 కోట్లతో పునరుద్ధరించారు. వీటి పురాతన ఔన్నత్యాన్ని కాపాడుతూ, అప్పటి నిర్మాణాలు ఏమాత్రం చెక్కుచెదరకుండా వీటిని నిర్మాణం జరిగింది. అయితే ఇది జరిగి రెండు సంవత్సరాలు పూర్తయినప్పటికీ వీటిని ఈనాటికీ అమలులోకి తేలేదు. ఇందుకు రెండు ప్రధాన కారణాలు ఉన్నాయి. ఒకటి చారిత్రక ప్రసిద్ధి చెందిన ఇటువంటి భవనాలను ప్రైవేటు వ్యక్తులకు ఇస్తే వాటి పురాతన ఔన్నత్యం దెబ్బతినే వీలుంటుంది. అందుకనే వీటిని ప్రైవేటు వ్యక్తులకు అప్పగించలేదు. ఇక రెండో కారణం ఈ భవనాలను జివిఎంసి వారే నిర్వహించాలని భావించారు. అయితే ఈ భవనాలకు ఈనాటికి సరైన రోడ్డు మార్గం లేదు. ఈ భవనాలకు వెళ్లే రోడ్డును వెడల్పు చేసి విస్తరణ చేయాలి. కనీసం 30 అడుగుల వెడల్పుతో ఈ రోడ్డు నిర్మాణం ఉండాలి. అదే సందర్భంలో జగదాంబ జంక్షన్ నుంచి పాత పోస్ట్ ఆఫీస్‌కి వెళ్లే మెయిన్ రోడ్డు చాలా ఇరుకుగా ఉండేది. దానిని ఇటీవల 60 అడుగుల వెడల్పుతో విస్తరణ చేపట్టారు. ఈ రోడ్డును ఆనుకునే టౌన్ హాల్, పాత మున్సిపల్ కార్యాలయ భవనాల రోడ్డు ఉంది. మెయిన్ రోడ్ విస్తరణతో పాటు వాటికి వెళ్లే రోడ్డు కూడా విస్తరణ చేయాల్సిన అవసరం ఇప్పుడు మరింత కలిగింది.

ఇకపోతే వీటి చారిత్రక ప్రాధాన్యతను దెబ్బతీయకుండా, కాపాడుకునే విధంగా ప్రభుత్వ రంగ సంస్థలను ఇక్కడ నిర్వహిస్తే మంచిదని ఆలోచనతో జివిఎంసి ఒక ప్రతిపాదన చేసింది. దాని ప్రకారం ఆంధ్రప్రదేశ్ హ్యూమన్ రిసోర్స్ డెవలప్మెంట్ ఇనిస్టిట్యూట్, పబ్ సర్వీస్ కమిషన్ ద్వారా ఎంపిక చేయబడిన ప్రభుత్వ అధికారులకు శిక్షణ కేంద్రాలుగా ఈ రెండు భవనాలను వినియోగిస్తే మంచిదని ప్రతిపాదన. రాష్ట్ర ప్రభుత్వానికి దాదాపు ఏడాదిన్నర క్రితం జివిఎంసి పంపడం జరిగింది. దానికి ఆమోదం లభిస్తే భవనాల పూర్వ ఔన్నత్యానికి ఏమాత్రం నష్టం కలగని రీతిలో వీటి వినియోగం ఉంటుంది. అయితే ఏ కారణం చేతనో ప్రభుత్వం నుంచి గ్రీన్ సిగ్నల్ లభించలేదు. దీంతో కోట్ల రూపాయలు వెచ్చించి పునరుద్ధరించబడిన ఈ రెండు చారిత్రక భవనాలు మళ్లీ పాడయ్యే అవకాశం ఉందని చరిత్రకారులు అభిప్రాయపడుతున్నారు.

పాత మున్సిపల్ కార్యాలయం

'దక్షిణం'లో గెలుస్తా : వంశీకృష్ణ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : దక్షిణ నియోజకవర్గంలో కూటమి తరపున పోటీ చేసిన తాను భారీ ఆధిక్యంతో విజయం సాధించనున్నట్టు జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి వంశీకృష్ణ శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం టిడిపి జిల్లా కార్యాలయంలో టిడిపి, జనసేన, బిజెపి ఉమ్మడి నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికలలో కష్టపడిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు నేతృత్వాన ప్రధాని నరేంద్ర మోడీ, పవన్ కల్యాణ్ సహకారంతో కూటమి ప్రభుత్వం ఏర్పడబోతుందని అన్నారు. రాష్ట్రంలో అరాచక పాలనను అంతం చేయడానికి కష్టపడిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. దక్షిణ నియోజకవర్గంలో ఓటమి తెలిసిపోవడంతో పోలింగ్ రోజు మధ్యాహ్నం నుంచే వైసిపి నాయకులు పోలింగ్ బూత్‌లు వదిలేసి వెళ్లిపోయారన్నారు. జగన్మోహన్ రెడ్డిని ప్రజలు ఇప్పటికే పదవి నుంచి పీకేశారన్నారు. జగన్ ప్రశాంతంగా లండన్‌లోనే ఉండాలని అన్నారు. సమావేశంలో టిడిపి దక్షిణ నియోజకవర్గం ఇన్‌ఛార్జి సీతంరాజు సుధాకర్, కార్పొరేటర్లు కందుల నాగరాజు, భీశెట్టి వసంత, మహమ్మద్ సాధిక్, విల్లూరి భాస్కరరావు, ఉరుకూటి నారాయణరావు, గొలగాని వీరారావు, గోడి అరుణ, టిడిపి సీనియర్ నాయకులు విల్లూరి చక్రవర్తి, జనసేన నియోజవర్గం ఇంచార్జ్ పి.శివప్రసాద్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

వెలగని వీధిలైట్లు

వీధిలైట్లు వెలగక చీకటిగా ఉన్న ఆరిలోవ కాలనీ

ఇబ్బందుల్లో స్థానికులు

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి 13వ వార్డు పరిధి ఆరిలోవ కాలనీ చివరి ప్రాంతాలైన శివాజీనగర్-2, భగత్‌సింగ్ నగర్ పరిసర ప్రాంతాల్లో వీధిలైట్లు వెలగకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆ ప్రాంతంలో బస్టాపు, వైన్‌షాపు, బార్‌లు ఉండడంతో ఎక్కువగా జనసంచారం ఉంటుంది. కుక్కలు, మందుబాబులు, ఆకతాయిలు వల్ల చిన్నారులు, వృద్ధులు, మహిళలు భయపడుతున్నారు. ఇక్కడ వైన్‌షాపు, బార్ ఉండడంతో మందు బాబులు తూగుతుంటారు. ఆ సమయంలో చీకటిలో మహిళలు రాకపోకలు సాగించాలంటే బెంబేలెత్తిపోతున్నారు. ఇదే రహదారిలో వాకర్స్ ఎక్కువగా నడుస్తుంటారు. రాత్రిపూట దొంగతనాలు జరుగుతాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. వీధి దీపాలు పునరుద్ధరించాలని సంబంధిత అధికారులకు, స్థానిక కార్పొరేటర్‌కు ఫోన్లు చేసినా స్పందించడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఈ ప్రాంతాల్లో వీధి దీపాలు పునరుద్ధరించాలని కోరుతున్నారు.

తెలంగాణ ఇఎపి సెట్‌లో శశి విద్యార్థుల ప్రతిభ

స్టేట్ 120వ ర్యాంకర్ తనీష్ షణ్ముఖ శ్రీసాయి

ప్రజాశక్తి -తగరపువలస : తెలంగాణ ఈఎపి సెట్ ఫలితాల్లో తమ విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించినట్లు సంగివలస శశి విద్యా సంస్థల వైస్ చైర్మన్ మేకా నరేంద్ర కృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫార్మసీ విభాగంలో కె.తనీష్ షణ్ముఖ శ్రీ సాయి స్టేట్ 120వ ర్యాంకు, ఫణి 83వ ర్యాంకు సాధించినట్లు తెలిపారు. వీరికి అభినందనలు తెలిపారు.

150 మందికి వైద్య సేవలు

ప్రజాశక్తి రంపచోడవరం : రాజమండ్రి రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్యశాల అధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన వైద్య శిబిరంలో 150 మందికి వైద్యసేవలు అందించినట్లు రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయనంద జీ మహారాజ్ తెలిపారు. వైద్య శిబిరంలో డాక్టర్లు టి.వి.సుబ్బారావు, దాసరి ఉమామహేష్. రాయుడు శ్రీనివాస్, ఎస్.సంపత్ కుమార్ పాల్గొని రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు అందజేశారు. ఈసందర్భంగా 53మందికి రక్తపరీక్షలు, ఏడుగురికి థైరాయిడ్ పరీక్షలు,12మందికి ఫిజియోథెరపీ, 20మందికి ఎక్స్‌రేలు, ఇద్దరికి ఇసిజి పరీక్షలు చేసినట్లు స్వామీజీ తెలిపారు. ప్రతిఆదివారం నిర్వహించే వైద్యశిబిరాల ద్వారా రామకృష్ణ మిషన్ అందిస్తున్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని స్వామీజీ కోరారు. వైద్య శిబిరంలో క్యాంప్ కోఆర్డినేటర్ కానుమోను శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు. కాగా వైద్యశిబిరానికి వచ్చే రోగులు, సహాయకులకు భోజన సదుపాయం కల్పించారు.

ధ్రువపత్రాలు మంజూరు చేయాలి

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: పదవ తరగతి, ఇంటర్ ఉత్తీర్ణులైన విద్యార్థులు ఉన్నత చదువులకు దరఖాస్తు చేసుకోవడానికి అవసరమైన కుల ధ్రువీకరణ పత్రాలను రెవెన్యూ అధికారులు సకాలంలో మంజూరు చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు టి సూర్యనారాయణ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, ఎన్నికల సందర్భంగా పనుల్లో ఉండటంతో సంబంధిత రెవెన్యూ అధికారులు కుల ధృవీకరణ పత్రాలు జారీ చేయడంలో ఆలస్యం జరగడంతో విద్యార్థులు ఉన్నత చదువులకు దరఖాస్తు చేసుకోవడానికి పలు ఇబ్బందులు పడ్డారన్నారు. తక్షణమే అధికారులు స్పందించి సకాలంలో కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు సిహెచ్ రామ్మూర్తి, పాపారావు, సూకరాజు పాల్గొన్నారు.

రాజవొమ్మంగిలో వర్షం

ప్రజాశక్తి- రాజవొమ్మంగి : మండలంలోని ఆదివారం సాయంత్రం భారీవర్షం కురిసింది, సాయంత్రం వరకు తీవ్రమైన ఎండ కాయడంతోపాటు వడగాలులు వీయడంతో మండలవాసులు ఉక్కపోతతో అల్లాడిపోయారు. సాయంత్రం వేళ వాతావరణంలో ఆకస్మికంగా మార్పులు చోటుచేసుకుని, మబ్బులు కమ్ముకొని ఈదురుగాలులతో కూడిన భారీవర్షం కురిసింది, తీవ్రమైన ఎండలకు అల్లాడుతున్న మన్యవాసులంతా వర్షంతో వాతావరణం చల్లబడడంతో సేదతీరారు.

కాలినడక వంతెన పనులు ప్రారంభించాలి

సమావేశంలో పాల్గొన్న పౌరసంక్షేమ సంఘం సభ్యులు

ప్రజాశక్తి-మధురవాడ : జాతీయరహదారిపై చంద్రంపాలెం ఉన్నత పాఠశాల ఎదురుగా కాలి నడక వంతెన నిర్మాణ పనులను త్వరితగతిన ప్రారంభించేలా ప్రభుత్వాధికారులు చర్యలు తీసుకోవాలని మధురవాడ పౌరసంక్షేమ సంఘం అధ్యక్షులు నాగోతి సూర్యప్రకాష్ కోరారు. మధురవాడ శివశక్తి నగర్‌లో సంఘం కార్యవర్గ సభ్యులు సమావేశమై పరిసర ప్రాంతాల్లో సమస్యల గురించి చర్చించారు. ఎత్తు వంతెన కింద వర్షపు నీరు నిలిచిపోవడం, పౌర గ్రంథాలయ నిర్మాణం, ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సిబ్బంది కొరత తదితర సమస్యల పరిష్కారానికి అంతా కలిసి కట్టుగా కృషిచేయాలని సభ్యులు నిర్ణయించారు. కార్యక్రమంలో పి.నాగేశ్వరరావు, వై.ఈశ్వరరావు, బ్రహ్మాజీ, జగన్మోహనరావు, శ్రీపాద వెంకటరమణ, ఎస్.రమేష్, బి.పాపారావు, వై.శ్రీనివాసరావు, వై.శంకరరావు, వంటాకుల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వాకర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గ సభ్యులను అభినందిస్తున్న వాకర్స్ సభ్యులు

ప్రజాశక్తి - ఆరిలోవ : ముడసర్లోవ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శి ఎన్నికలు ఆదివారం ఆరిలోవ కాలనీ స్కిల్‌డెవలెప్‌మెంట్ సెంటర్ సమీపంలోని ముడసర్లోవ వాకర్స్ అసోసియేషన్ కార్యాలయంలో ప్రశాంతంగా జరిగాయి. ఎన్నికల పరిశీలకులుగా అల్లంపల్లి రాజబాబు, కొరికాన మోహనరావు, పి.వెంకటేశ్వరరావు వ్యవహరించారు. ఈ ఎన్నికల్లో మొత్తం 126 మంది సభ్యులకు 117 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అధ్యక్షునిగా పల్ల శ్రీనివాసరావు తన ప్రత్యర్థి వివిఎస్.మూర్తిపై 30 ఓట్లు మెజార్టీతో గెలుపొందారు. చిట్టూరి సత్యనారాయణ 20 ఓట్ల మెజార్టీతో కోశాధికారిగా గెలుపొందారు. ప్రధాన కార్యదర్శిగా నాగులపల్లి రవికుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గౌరవాధ్యక్షులుగా కొరకాన మోహనరావు, సి.సాయికుమార్, ముఖ్య సలహాదారునిగా అల్లంపల్లి రాజబాబు, సలహాదారునిగా గూడపాటి విక్టర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు పల్ల శ్రీనివాసరావు, నాగులపల్లి రవికుమార్ మాట్లాడుతూ వాకర్స్ క్లబ్ సంక్షేమానికి తమ వంతు కృషిచేస్తామని హామీ ఇచ్చారు.

సమైక్య అపార్ట్‌మెంట్‌లో ఉచిత దంత వైద్యశిబిరం

సమైక్య అపార్ట్‌మెంట్‌లో దంత పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

ప్రజాశక్తి-గాజువాక : సుందరయ్య వర్ధంతిని పురస్కరించుకొని తోకాడ సమైక్య అపార్ట్‌మెంట్‌లో సాయి దుర్గ డెంటల్ క్లినిక్ ఆధ్వర్యాన ఉచిత దంత వైద్యశిబిరం నిర్వహించారు. సుమారు 100 మంది వరకు దంత వైద్య పరీక్షలు చేయించుకున్నారు. డెంటల్ సర్జన్ డాక్టర్ సూరిశెట్టి ప్రణయ్, సిబ్బంది సేవలందించారు. అపార్ట్‌మెంట్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం.వెంకటేశ్వరరావు, కార్యదర్శి తవిటయ్య, శంకరరావు, భాస్కరరావు, సన్యాసయ్య, మణి పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

బస్సు ఢీకొని యువకుడు మృతి

ప్రజాశక్తి -నక్కపల్లి : నక్కపల్లి జాతీయ రహదారిపై వేంపాడు టోల్ గేట్ సమీపంలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. గుంటూరు జిల్లా ఏటి అగ్రహారం ఫాతిమా నగర్‌కు చెందిన కంతటి నవీన్ (21), తన స్నేహితుడు తొలిచూరి వంశీకృష్ణ తో కలిసి బైక్ పై 17న అరకు వెళ్లారు. అరకు నుండి తిరిగి శనివారం రాత్రి 11 గంటల ప్రాంతంలో వేంపాడు టోల్ గేటు టోల్లేట్ దాటాక ఆర్టీసీ బస్సు ఢీ కొట్టింది. నవీన్ పై నుంచి బస్సు వెళ్లడంతో నవీన్ అక్కడికక్కడే మృతి చెందాడు. వంశీకృష్ణ తీవ్రంగా గాయపడటంతో తుని ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గఫూర్ తెలిపారు.

13 కిలోల గంజాయి పట్టివేత

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని ఏటిగైరంపేట వద్ద 13 కేజీల గంజాయితో ముగ్గురిని అరెస్టు చేసినట్లు గొలుగొండ ఎస్సై కృష్ణారావు తెలిపారు. ఏటిగైరంపేట వద్ద తనిఖీల్లో భాగంగా ముగ్గురు వ్యక్తుల వద్ద ఈ గంజాయి పట్టుబడిందన్నారు. వీరిని అరెస్టు చేసిన రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

ఘనంగా కుంతీమాధవస్వామి చందనోత్సవం

ప్రజాశక్తి -పద్మనాభం : పద్మనాభంలోని శ్రీ అనంతపద్మనాభ స్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న కుంతీ మాధవస్వామికి ఆదివారం చందనోత్సవ కార్యక్రమాన్ని భక్తులు, పురోహితులు ఘనంగా నిర్వహించారు. ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భీమిలి నియోజకవర్గ కూటమి అభ్యర్థి గంటా శ్రీనివాసరావు, వైసిపి అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు సోదరుడు మహేష్, స్థానిక ఎంపిపి రాంబాబు, పద్మనాభం ఎంపిటిసి సభ్యులు కె.లక్ష్మి, సర్పంచ్ టి.పాప తదితరులు పాల్గొన్నారు.

ఒకే చోట కలుసుకున్న పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం మండలం గొట్టిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2008 -09 బ్యాచ్ 10వ తరగతి విద్యార్థులు మండలంలోని గుడిలోవ వద్ద ఆదివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. చదువుకున్న నాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ఆటపాటలతో ఆనందంగా గడిపారు. అనంతరం బరువెక్కిన హృదయాలతో తిరిగి ప్రయాణమయ్యారు.

పూడిమడకలో కవాతు చేస్తున్న ప్రత్యేక భద్రతా దళ సిబ్బంది

సమస్యాత్మక గ్రామాలలో ఫ్లాగ్ మార్చ్

ప్రజాశక్తి -అచ్యుతాపురం : మండలంలో సమస్యాత్మక గ్రామాలైన పూడిమడక, మోసయ్యపేట, భోగాపురం గ్రామాలలో ఆదివారం ప్రత్యేక భద్రతా దళ సిబ్బంది పోలీసులు గ్రామ పురవీధులలో ర్యాలీగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ ఎం బుచ్చిరాజు మాట్లాడుతూ ఎన్నికల అనంతరం ప్రతిఒక్కరూ సంయమనం పాటించాలని, శాంతి భద్రతలకు భంగం కలిగించకుండా వ్యవహరించి, పోలీసులకు సహకరించాలని పిలుపునిచ్చారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందువలన నియమ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

రక్తం దానం చేస్తున్న దాతలు

లయన్స్ క్లబ్ రక్తదాన శిబిరం

ప్రజాశక్తి -గాజువాక : సామాజిక సేవలో భాగంగా గాజువాక లయన్స్ క్లబ్ ఆధ్వర్యాన జగ్గు జంక్షన్ కూడలిలోని క్లబ్ ఆవరణలో మెగా రక్తదాన శిబిరం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గాజువాక లయన్స్ క్లబ్ అధ్యక్షుడు చిక్కా సత్యనారాయణ మాట్లాడుతూ, వేసవిలో రక్త నిల్వలు తక్కువగా ఉంటున్న నేపథ్యంలో ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారిని ఆదుకోవాలనే ఉద్దేశంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో రక్తం చాలక చాలామంది ఇబ్బందులు పడుతున్నారన్నారు. రోగులకు అండగా ఉండడం కోసం ప్రాంతాల వారీగా శిబిరాలు నిర్వహించి, ప్రజా చైతన్య కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. పేదరిక నిర్మూలన, అక్షరాస్యత సాధన, బాల్య వివాహాలను అరికట్టడం, పోలియో నిర్మూలన వంటి కార్యక్రమాలు నిర్వహించడమే లక్ష్యంగా తమ క్లబ్ పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ ప్రతినిధి వెంకటరెడ్డి, లయన్స్ క్లబ్ కార్యదర్శి సత్యాల కోటేశ్వరరావు, గాజువాక క్లబ్ కార్యదర్శి కృష్ణకుమార్, జీవన్ బాబు, అచ్యుతరావు, సున్న శ్రీనివాసరావు, బోయిన బాబూరావు, తిప్పల అప్పలస్వామి తదితరులు పాల్గొన్నారు. లయన్స్ బ్లడ్ బ్యాంక్ సిబ్బంది రక్త దాతల నుంచి రక్తాన్ని సేకరించారు.

వేడుకగా అన్నమయ్య సంకీర్తన పోటీలు

ప్రజాశక్తి-సీతమ్మధార : ద్వారకానగర్‌లోని పబ్లిక్ లైబ్రరీలో శృతిలయ వ్యవస్థాపకులు వి.ప్రభాకర్ సారథ్యంలో అన్నమాచార్యుని జయంతి సందర్భంగా అన్నమాచార్య సంకీర్తన పోటీలను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన డాక్టర్ ద్వారం త్యాగరాజు జ్యోతిని వెలిగించి సంకీర్తన పోటీలను ప్రారంభించారు. నాలుగు విభాగాల్లో 300 మంది కళాకారులు పాల్గొన్నారు. అనంతరం సభికులను ఉద్దేశించి ద్వారం త్యాగరాజు ప్రసంగిస్తూ సరస్వతి అమ్మవారి ప్రతిరూపంగా సంగీతం ఆవిర్భవించిందని, ఏ కళాకారుడికైనా భక్తి, శ్రద్ధ, ఏకాగ్రత, సాధన ఎంతో అవసరమన్నారు. సాధనతోనే ఉత్తమ సంగీత కళాకారులుగా రాణిస్తారని తెలిపారు. తేనె వంటి తెలుగు పదాలతో శ్రీవెంకటేశ్వర స్వామి వారిని సంకీర్తన రూపంలో కీర్తించిన ఘనత ఒక అన్నమాచార్యునికే దక్కిందన్నారు. మంచి కార్యక్రమాన్ని చేపట్టిన శృతిలయ సంస్థ నిర్వాహకులను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం మాజీ చైర్మన్ వంకాయల సన్యాసిరాజు, శృతిలయ సంస్థ కార్యదర్శి ఎం.ఎస్.మాధవ్, కొణతాల రాజు, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంవి.రాజశేఖర్, సిహెచ్‌వి.సత్యనారాయణ, మేడా మస్తాన్‌రెడ్డి, కె.మంజుల తదితరులు పాల్గొన్నారు. నగరానికి చెందిన శాస్త్రీయ సంగీత ప్రముఖులు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. అధిక సంఖ్యలో పోటీదారులు, సంగీత ప్రియులు పాల్గొన్నారు. విజేతలకు ఈనెల 23వ తేదీన అన్నమాచార్యుని జయంతి రోజున సాయంత్రం 5.30 గంటలకు పబ్లిక్ లైబ్రరీలో ప్రముఖుల ద్వారా బహుమతులను అందజేయనున్నట్లు శృతిలయ అధ్యక్షులు వి ప్రభాకర్ తెలిపారు.

పెద్దకొత్తూరులో నూకాంబిక అమ్మవారి పండగ

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 47వ వార్డు పరిధి పెద్దకొత్తూరులో ఆది ఆంధ్ర యువజన సేవా సంఘం ఆధ్వర్యాన నూకాంబిక అమ్మవారు పండుగ నిర్వహించారు. విశాఖ ఉత్తర నియోజకవర్గం వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి కెకె.రాజు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో విశాఖపట్నం పిఐఆర్ చైర్మన్ చొక్కాకుల వెంకటరావు, జివిఎంసి స్టాండింగ్ కమిటీ మెంబర్ కంటిపాము కామేశ్వరి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకర్రావు, చంద్రమౌళి, 47వ వార్డు నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

చిత్రకళా పోటీలతో సృజనాత్మకత

ప్రజాశక్తి -ములగాడ : చిత్ర కళా పోటీల్లో పాల్గొనడం ద్వారా సృజనాత్మకత వెల్లివిరుస్తుందని, ప్రతిభకు తగిన గుర్తింపు లభిస్తుందని జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రామ్ అధికారి ఐపిఎస్.భాగ్యలక్ష్మి అన్నారు. మల్కాపురంలోని ప్రకాష్‌నగర్ శాఖా గ్రంథాలయంలో ఈ నెల 15వ తేదీ నుంచి నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో ఆదివారం ఆమె పాల్గొని మాట్లాడారు. చిత్రకళకు 64 కళల్లో అత్యున్నత స్థానం ఉందని, చిత్రాన్ని ఆవిష్కరించడంలో గల నేర్పు, రంగుల కలయిక చిత్రకారుని ప్రతిభను, కళా దృష్టిని తెలియజేస్తాయని చెప్పారు. చిన్నతనం నుంచి విద్యార్థులకు చిత్రకళలో మెళకువలు, పాఠశాలల్లో, వివిధ శిక్షణ శిబిరాల్లో నేర్పాలని అన్నారు. రాజా రవి వర్మ, వడ్డాది పాపయ్య, అంట్యాకుల పైడిరాజు వంటి ప్రముఖ చిత్రకారులను గురించి చిన్నారులు తెలుసుకోవాలన్నారు. అనంతరం "గ్రంథాలయాల్లో వేసవి శిక్షణ శిబిరాలు" అనే అంశంపై సీనియర్ విద్యార్థులకు, "అందమైన ప్రకృతి దృశ్యం" అనే అంశంపై జూనియర్ విద్యార్థులకు పోటీలను నిర్వహించారు. పోటీల్లో 20 మంది పాల్గొన్నారు. కె.సత్తిరాజు, గ్రంథాలయాధికారి వి.అజయ్‌కుమార్, సిద్ధార్థ న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. అనంతరం విద్యార్థులు వివిధ రకాల కథలను పఠించారు.

చిత్రకళ పోటీలో పాల్గొన్న విద్యార్థులు

బస్సు షెల్టర్లు కరువు

ఎండవానల్లో ప్రయాణికుల అవస్థలు

తగరపువలస జంక్షన్‌లో బస్సు కోసం నిరీక్షిస్తున్న ప్రయాణికులు

ప్రజాశక్తి -యంత్రాంగం

తగరపువలస : ఓ వైపు పెరుగుతున్న జనాభాకు తగ్గట్టుగా అవసరాలు కూడా పెరుగుతున్నాయి. ప్రజల అవసరాలను గుర్తించడంలో పాలకులు, అధికారులు విఫలం అవుతున్నారు. ఇందుకు ఉదాహరణగా అనేక అంశాలు మన కళ్ల ముందునే ఉన్నాయి. ప్రముఖ వాణిజ్య కేంద్రంగా అభివృద్ధి చెందుతున్న తగరపువలసలో బస్ షెల్టర్లు లేక ప్రయాణికులు అనేక అవస్థలు పడుతున్నారు. ఏళ్ల గడుస్తున్నా, ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వాలు మారుతున్నా ఇక్కడ బస్‌షెల్టర్లు మాత్రం ఏర్పాటు చేయడం లేదు. శర వేగంగా అభివృద్ధి చెందుతున్న విశాఖ నగరానికి సుమారు 35 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ పట్టణంలో అవసరమైన చోట కనీసం బస్ షెల్టర్లు లేక పోవడంపై పలువురు విస్తు పోతున్నారు. మద్దిలపాలెం ఆర్‌టిసి డిపో నుంచి తగరపువలస దాదాపు 35 బస్ సర్వీసులు (222), పెందుర్తి వెళ్లే 4 బస్సులు (55టి), అనకాపల్లి వెళ్లేందుకు అనకాపల్లి, మద్దిలపాలెం డిపోలకు చెందిన 6 బస్సులు (888), స్టీల్ సిటీ డిపో కుర్మన్నపాలెం నుంచి 3 బస్సులు (111 వి) నిత్యం తగరపువలస వస్తూ వెళ్తుంటాయి.

మండే ఎండలో ప్రయాణికులు..

ఎంతో ప్రాధాన్యత ఉన్న ఈ ప్రాంతంలో బస్ షెల్టర్‌ను ఏర్పాటు చేయకపోవడం దారుణం. బస్ షెల్టర్ లేక పోవడంతో ఎండ కాసినా, వర్షం కురిసినా జంక్షన్ వద్ద ఉన్న షాప్ షాప్‌ల వద్ద బస్సుల కోసం నిలబడాల్సిన పరిస్థితి ఉంది. వృద్ధులు, మహిళలు, ప్రధానంగా చంటి పిల్లలతో వచ్చే మహిళలు పడే ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. విజయనగరం వెళ్లేందుకు బస్సుల కోసం ప్రయాణికులు ఉండేందుకు గతంలో బస్ షెల్టర్ ఉండేది. భీమిలి వెళ్లేందుకు కూడా బస్ షెల్టర్ ఉండేది. ఇప్పుడు ఇవేవీ లేవు. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడి నుంచి వందలాది మంది విద్యార్థులు, ఉద్యోగులు, కార్మికులు నిత్యం విశాఖ నగరానికి వెళ్తూ వస్తుంటారు. ఇంతటి ప్రాధాన్యత సంతరించుకున్న జంక్షన్‌లో కనీసం బస్ షెల్టర్ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఎండలో నిరీక్షణ

బస్సుల కోసం ఎండలో నిరీక్షించాల్సి వస్తుంది. కూర్చునేందుకు, బస్సుల కోసం నిరీక్షించేందుకు బస్ షెల్టర్‌ను ఏర్పాటు చేయాలి.

ఎం.రాము

ప్రభుత్వం స్పందించాలి

ప్రయాణికుల ఇబ్బందులను గుర్తెరిగి తగరపువలస జంక్షన్‌లో బస్ షెల్టర్ ఏర్పాటు చేయాలి. ఏళ్ల తరబడి బస్ షెల్టర్ లేక ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. మరుగు దొడ్లు కూడా లేవు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి బస్ షెల్టర్, మరుగుదొడ్లు నిర్మించాలి.

రవ్వ నరసింగరావు
సిఐటియు నాయకులు

శ్రీనగర్ జంక్షన్‌లోనూ...

గాజువాక : విశాఖ నగరంలో ప్రతి జంక్షన్లోనూ ముఖ్యమంత్రి ఫొటోతో బస్సు బేలు ఏర్పాటుచేసిన అధికారులు, పాలకులు, శ్రీనగర్ జంక్షన్‌లో మాత్రం ఏర్పాటుచేయలేదు. గత కొన్ని సంవత్సరాలు క్రితం నుంచి ఉన్న, బస్ స్టాప్‌ను తొలగించారు. బస్టాప్ లేకపోవడం వల్ల, వృద్ధులు, చంటి పిల్లలతో వచ్చే మహిళలు ఎండకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎండకి ఎండడం, వర్షానికి తడవడం పరిపాటిగా మారింది. గతంతో పోలిస్తే, ప్రస్తుతం శ్రీనగర్ ఏరియా వైశాల్యం బాగా పెరిగింది. మరిన్ని కాలనీలు కూడా ఏర్పడ్డాయి. స్కూల్ పిల్లలు, నగరంలో పనిచేసేందుకు వెళ్లే వారి సంఖ్య పెరిగింది. దీంతో ఈ జంక్షన్లో బస్సుల కోసం ప్రజలు ఎక్కువగానే నిలబడుతున్నారు. బస్టాప్ లేని కారణంగా వృద్ధులు దగ్గర్లో ఉన్న రాళ్ల మీద కూర్చోవలసి వస్తోంది. బస్సులు సమయానికి రాకపోవడం వల్ల గంటలు తరబడి కూర్చోడానికి వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షం వస్తే వేరే మార్గం లేక తడుస్తూనే బస్సు కోసం ఎదురుచూడాల్సి వస్తోంది. తన స్థలానికి అడ్డు వస్తుందని చెప్పి పై స్థాయిలో పైరవీలు నడిపి స్థానికంగా పలుకుబడి ఉన్న వ్యక్తి అక్కడి బస్టాప్‌ను తొలగించారు. ఆ రోజు నుండి నేటి వరకు బస్టాప్ ఏర్పాటు చేయడానికి అధికారులు ముందుకు రావడం లేదు. ఒక వ్యక్తి స్థలం కోసం ప్రజలను ఇబ్బంది పెట్టడం ఎంతవరకు సమంజసమని ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బస్టాప్ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

గాజువాక శ్రీనగర్ వద్ద బస్‌స్టాప్ లేక రోడ్డుపై ఎండలో బస్సు కోసం నిరీక్షిస్తున్న ప్రయాణికులు

సుందరయ్య ఆశయసాధనకు కృషి

సిపిఎం జిల్లా కార్యదర్శి లోకనాథం ... ఆదర్శనేత పుచ్చలపల్లికి ఘననివాళి

అనకాపల్లిలో సుందరయ్యకు నివాళులర్పిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి లోకనాథం

ప్రజాశక్తి- అనకాపల్లి : ఆదర్శ కమ్యూనిస్టు నేత, అజాతశత్రువు పుచ్చలపల్లి సుందరయ్య నేటితరానికి ఆదర్శప్రాయుడని సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం అన్నారు. ఆదివారం స్థానిక సిపిఎం కార్యాలయంలో పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘననివాళులర్పించారు. ఈసందర్భంగా పార్టీ మండల కన్వీనర్ గంటా శ్రీరామ్ అధ్యక్షతన జరిగిన సభలో లోకనాథం మాట్లాడుతూ దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమనిర్మాత, సిపిఎం తొలి జాతీయ ప్రధాన కార్యదర్శి సుందరయ్య పార్లమెంట్‌లో మొదటి ప్రతిపక్షనేతగా మన్ననలను పొందారన్నారు. ప్రజాసేవ కోసం పిల్లలే వద్దనుకోవడమే కాకుండా యావదాస్తిని త్యాగం చేసిన సుందరయ్య వంటి మహానేత నిరాడంబరతను, త్యాగనీతిని నేటి బూర్జువా పార్టీల నేతలకు కనువిప్పు కావాలన్నారు. నేడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలపైన, మతోన్మాదానికి వ్యతిరేకంగాను, కింది స్థాయిలో పోరాటాలను విస్తృతం చేయడం, ప్రజలను చైతన్యపరచడమే సుందరయ్యకు ఇచ్చే ఘనమైన నివాళన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.కోటేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు ఆర్.శంకరరావు, అల్లు రాజు, నాయకులు కె.ఈశ్వరరావు, బి.ఉమామహేశ్వరరావు, తెల్లయ్యబాబు, బి.నూకప్పారావు, కె.సుజాత, సుభాషిణి, ఎం.చంద్రశేఖర్, పి.చలపతి పాల్గొన్నారు.

మునగపాక: విలువలతో కూడిన రాజకీయాలకు నిలువెత్తు నిదర్శనం పుచ్చలపల్లి సుందరయ్య అని సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం అన్నారు .మండలంలోని గవర్ల అనకాపల్లి గ్రామంలో సుందరయ్య విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో సుందరయ్య 39వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సుందరయ్య జీవిత చరిత్రపై విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఆళ్ల మహేశ్వరరావు, రామలక్ష్మి, దాడి రమణబాబు, ఆళ్ల వెంకటేష్, కే పెదబాబు, పి.బాగేశ్వరరావు, దొడ్డి సూర్యనారాయణ, దొడ్డి అప్పారావు, ఆళ్ల సూరిబాబు, కాండ్రేగుల వెంకటరెడ్డి, మళ్ల నాగేంద్ర పాల్గొన్నారు.

మునగపాక మెయిన్ రోడ్‌లోని సిఐటియు కార్యాలయం ఆవరణలో సుందరయ్య చిత్రపటానికి సిఐటియు జిల్లా కోశాధికారి వీవీ శ్రీనివాసరావు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. సిఐటియు నాయకులు పెంట కోట. సత్యనారాయణ, అల్లారపు లోవేశ్వరరావు, ఆడారి అప్పలనాయుడు, మద్దాల జై పద్మ, ఆడారి శ్రీలక్ష్మి, ఆడారి కుమారి, సత్యవతి పాల్గొన్నారు.

వెంకటాపురంలో.... వెంకటాపురం గ్రామంలో ఉపాధి కూలీలతో కలిసి సుందరయ్య చిత్రపటానికి సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు, వెంకటాపురం మాజీ ఉపసర్పంచ్ గనిశెట్టి సత్యనారాయణ పూలమాలలు వేసి నివాళు లర్పించారు. చట్టసభలకు సైకిలుపై వెళ్లిన ఆదర్శమూర్తి సుందరయ్య అన్నారు. కార్యక్రమంలో బి పద్మారావు ,గోవిందా, అప్పారావు పాల్గొన్నారు.

దేవరాపల్లి : వీర తెలంగాణ సాయుధపోరాట రథసారథి, స్వాతంత్ర్యోద్యమనేత పుచ్చపల్లి సుందరయ్య వర్ధంతిని పురస్కరించుకుని దేవరాపల్లిలో ఆయన చిత్రపటానికి సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు డి వెంకన్న మండల కార్యదర్శి బిటి దొర పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అరుణపతాకాన్ని ఆవిష్కరించారు. సిహెచ్ దేముడు, లక్ష్మణ, కె సన్యాసి, డి శంకర్, సిహెచ్ దేముడు, కె.ఈశ్వరరావు, జె.ఈశ్వరరావు, బి నాగేశ్వరరావు, ఇ గోపాల్, కె అప్పన్న, చేదల చిన్నారావు, పైడి తల్లి, అంజనేయులు, సింహాచలం, ఎం.దేముడు పాల్గొన్నారు.

చోడవరం: సిపిఎం, ప్రజాసంఘాలు ఆధ్వర్యంలో చోడవరంలో పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. సుందరయ్య సేవలను కొనియా డారు. కార్యక్రమంలో సిపిఎం నేతలు ఎన్వి నాయుడు, జోగి నాయుడు, సత్తిబాబు, కోటి, రాజు పాల్గొన్నారు.

సబ్బవరం.: స్థానిక దుర్గమాంబ ముఠా కళాసీల సంఘం కార్యాలయంలో పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం ఉపాధ్యక్షులు ఉప్పాడ సత్యవతి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో దుర్గ మాంబ ముఠా కళాసీల సంఘం అధ్యక్షులు బర్ల రమణ, సిఐటియు నాయకులు మొల్లేటి గౌరీశ్వరరావు, రైతు సంఘం నాయకులు పప్పుల కోటేశ్వరరావు, కెవిపిఎస్ నాయకులు కె. కోటేశ్వరరావు పాల్గొన్నారు.

రాంబిల్లి . మండల కేంద్రంలో పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి సిపిఎం సీనియర్ నాయకులు, రుత్తల రాంబాబు పూలమాలవేసి పార్టీ నాయకులు నివాళు లర్పించారు. సిపిఎం మండల కన్వీనర్, జి దేవుడు నాయుడు సుందరయ్య త్యాగాలు, పోరాట పటిమ, నిర్మాణ దక్షతను కొనియాడారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు నాగు మంత్రి నారాయణరావు, చింతకాయల శివాజీ, చందక రామకృష్ణ, రుత్తల రాంబాబు, వాసు, శ్రీను, నరేష్, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

పరవాడ: స్థానిక ఊరుచెరువు వద్ద ఉపాధి హామీ కూలీలతో కలిసి పుచ్చపల్లి సుందరయ్య వర్ధంతిని జరుపుకున్నారు.సుందరయ్య చిత్రపటానికి . సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గని శెట్టి సత్యనారాయణ పూలమాలలు వేసి నివాళులర్పించారు సుందరయ్య లాంటి అదర్శమూర్తులను నిర్మించిన పార్టీలో భూమి కోసం, పేద ప్రజల విముక్తి కోసం మరిన్ని పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వెంకటలక్ష్మి, కుమారి, అప్పల నరసమ్మ పాల్గొన్నారు

కె.కోటపాడు. స్థానిక సిఐటియు కార్యాలయంలో సుందరయ్య చిత్రపటానికి సిపిఎం, ప్రజా, రైతు సంఘం నాయకులు పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఏపి రైతు సంఘం జిల్లా కోశాధికారి గండి నాయన బాబు, . సిపిఎం నాయకులు ఎర్రదేముడు, సిఐటియు నేత ఈర్లె నాయుడుబాబు, కెవిపిఎస్ నేత గాడి ప్రసాదులు మాట్లాడుతూ సుందరయ్య ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు వనము సూర్యనారాయణ, జిఎంపిఎస్ జిల్లా డైరెక్టర్ పల శ్రీరాములు. సత్యవతి పాల్గొన్నారు.

అచ్యుతాపురం : మండలంలోని హరిపాలెంలో సిపిఎం వ్యవస్థాపక కార్యదర్శి పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతిని పురస్కరించుకుని సిపిఎం సీనియర్ నాయకులు ఎస్.కనుమ నాయుడు పార్టీ జెండాను ఆవిష్కరించారు. సుందరయ్య చిత్రపటానికి సిపిఎం సీనియర్ నాయకులు కె.రామ సదాశివరావు, మండల కన్వీనర్ ఆర్. రాము పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమంలో హరిపాలెం శాఖ కార్యదర్శి బి. రామ్ కుమార్ ,పుష్ప, బాబూరావు పాల్గొన్నారు.

మునగపాక, దేవరాపల్లి, పరవాడల్లో పుచ్చలపల్లి సుందరయ్యకు నివాళులర్పిస్తున్న సిపిఎం, ప్రజాసంఘాల నేతలు, ఉపాధి కూలీలు, ప్రజలు

21 నుంచి ఇండో, యుఎస్ వర్క్‌షాప్

- హైడ్రోజన్, డీకార్బనైజేషన్‌పై ఐఐపిఇ ఆధ్వర్యంలో నిర్వహణ

ప్రజాశక్తి- సబ్బవరం : స్టోనీ బ్రూక్ యూనివర్శిటీ, న్యూయార్క్ సహకారంతో, ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ (ఐఐపిఇ) విశాఖపట్నం, ఈ నెల 21 నుండి 23, వరకు విశాఖ నోవాటెల్ హోటల్‌లో హైడ్రోజన్, గ్లోబల్ డీకార్బనైజేషన్స్‌పై ఇండో, యుఎస్ వర్క్‌షాప్‌ను నిర్వహించేందుకు సన్నద్ధమయ్యింది. ఐఐపిఇ డైరెక్టర్ ప్రొఫెసర్ శాలివాహన్ విడుదల చేసిన ప్రకటనలో గ్లోబల్ డీకార్బనైజేషన్ ప్రయత్నాలలో కీలకమైన అంశంగా హైడ్రోజన్‌పై చర్చించడానికి ఇంధన రంగంలోని పరిశ్రమల ఎగ్జిక్యూటివ్‌ల కోసం ప్రత్యేకంగా ఫోరమ్ రూపొందించబడిందన్నారు. మూడు రోజుల వర్క్ షాప్‌లో హైడ్రోజన్‌పై ప్రత్యేక ప్రాధాన్యతతో, కార్బన్ తక్కువ ప్రత్యామ్నాయాలను ఉపయోగించి వాతావరణ మార్పు, శిలాజ ఇంధనాలు, డీకార్బనైజేషన్ వ్యూహాలపై సమగ్ర సెషన్లు ఉంటాయన్నారు. ఈవెంట్‌లో అకాడెమియా, పరిశ్రమలు, విధాన రూపకర్తల నిపుణులతో సహ స్పీకర్లను ఆకట్టుకునే లైనప్ ఉందన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎన్‌టిపిసి మాజీ డైరెక్టర్ (ప్రాజెక్ట్) ఉజ్వల్ కాంతి భట్టాచార్య హాజరు కానున్నారని తెలిపారు. గౌరవ అతిథిగా సింహాద్రి ఎన్‌టిపిసి ప్రాజెక్ట్ హెడ్ ఎస్‌కె. సిన్హా పాల్గొంటారన్నారు. క్లీన్ ఫ్యూయల్ ప్రొడక్షన్ టెక్నాలజీస్, డీకార్బనైజేషన్లో ప్రముఖ నిపుణుడైన స్టోనీ బ్రూక్ యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్ దేవిందర్ మహాజన్ గ్రీన్ హైడ్రోజన్, ఎనర్జీ ట్రాన్సిషన్‌లో సరికొత్త పురోగతిని వివరించనున్నారని తెలిపారు. ఐఐపిఇ విశాఖపట్నంకు చెందిన ప్రొఫెసర్ కృష్ణశ్రీ వి. కురాడ హైడ్రోజన్ నిల్వ, రవాణాపై చర్చించనున్నారు. చివరి రోజు కీలకమైన పారిశ్రామిక రంగాలలో హైడ్రోజన్ స్వీకరణ కోసం డీకార్బనైజేషన్ మార్గాలను అన్వేషించనుంది. వినూత్న హైడ్రోజన్ టెక్నాలజీల ద్వారా కార్బన్ ఉద్గారాలను తగ్గించడంలో సహకరించడానికి, వివిధ రంగాలలోని వాటాదారులకు ఈ వర్క్‌షాప్ ఒక ప్రత్యేకమైన అవకాశాన్ని సూచిస్తుంది. నిపుణులైన అధ్యాపకులు, సమగ్ర ఎజెండాతో నిర్వహిస్తున్న హైడ్రోజన్ గ్లోబల్ డీకార్బనైజేషన్స్‌పై ఇండో యుఎస్ వర్క్‌షాప్ సుస్థిర భవిష్యత్తు కోసం విశాఖపట్నంను గ్రీన్ హైడ్రోజన్ హబ్‌గా మార్చడంలో ఒక మైలురాయి గా ఈవెంట్ మారనుందన్నారు.

విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల ఔదార్యం

నిరుపేదల ఇళ్ల నిర్మాణానికి ఆర్థిక సాయం

ఆర్థిక సాయం అందజేస్తున్న గేదెల సత్యనారాయణ

ప్రజాశక్తి- వద్దాది : విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ మరోసారి తన ఔదార్యాన్ని చాటుకున్నారు. అసంపూర్తిగా నిలిచిపోయిన ఇద్దరు నిరుపేద కుటుంబాల ఇళ్ల నిర్మాణాలకు తన సొంత నిధులతో ఆర్థికసాయం అందించి అండగా నిలిచారు. ఆదివారం కోమలపూడి పంచాయతీ బుదిరెడ్డిపాలెంలో . శౌంర్యాన ఆచారి తన ఇంటి శ్లాబ్ పూర్తి చేయలేక అసంపూర్తిగా నిలిపేసి, పూర్తిచేయలేని దుస్థితిని గమనించిన విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ తన సొంత నిధులు రూ.50 వేలు విరాళంగా అందజేశారు. అలాగే ఎన్నంశెట్టి ఏసు అనే వ్యక్తి ఇంటి మరమ్మతులకు మరో రూ.20వేలు ఆర్థికసాయం అందించారు. కష్టకాలంలో ఇంటి నిర్మాణాల కోసం ఆర్థిక తోడ్పాటు అందించిన గేదెల సత్యనారాయణ ఉదారతను లబ్ధిపొందిన కుటుంబ సభ్యులతో పాటు గ్రామస్తులు అభినందించారు

ఘనంగా గ్రీన్ క్లబ్ దశాబ్ది ఉత్సవాలు

వరి కుంచెలుపై శిక్షణ ఇస్తున్న గ్రీన్‌క్లబ్ సభ్యులు

ప్రజాశక్తి- అనకాపల్లి : గ్రీన్ క్లబ్ ఏర్పాటు చేసి పదేళ్లు పూర్తయిన నేపథ్యంలో దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నట్టు క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు కొణతాల ఫణి భూషణ్ శ్రీధర్ తెలిపారు. ఆదివారం స్థానిక లయన్స్ క్లబ్‌లో తుని హరిత వికాస్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు పాలుపర్తి దాలినాయుడు ఆధ్వర్యంలో పక్షుల మేత కోసం వరి కుంచెల తయారీపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా పర్యావరణహిత స్టాల్స్ ప్రదర్శన, 75ఏళ్లు నిండిన వయోవృద్ధులకు సత్కారం, గ్రీన్ క్లబ్ మహిళలకు ఆటల పోటీలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతి ప్రదానం, వరి కుంచెలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘ సేవకులు కర్రి సన్యాసి నాయుడు, పెంటకోట ఉమా మహేశ్వరరావు, అటవీ శాఖ విశ్రాంత అధికారి వినోద్ కుమార్, ఎస్ఎఫ్ఐ సత్యనారాయణ, బేతాళం శేష సాయి పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌లో ప్రశ్నాపత్రాలు భద్రం

పోలీస్‌స్టేషన్‌కు టెన్త్ సప్లమెంటరీ ప్రశ్నాపత్రాలు

ప్రజాశక్తి- సబ్బవరం : ఈనెల 24 నుండి జరగనున్న పదో తరగతి సప్లమెంటరీ పరీక్షలకు సంబంధించి ప్రశ్నాపత్రాలు ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్‌కు చేరాయి. ఈ ప్రశ్న పత్రాలను కస్టోడియన్, చీఫ్ సూపరింటెండెంట్ రొంగలి ప్రసాద్ సమక్షంలో పోలీస్ స్టేషన్లో భద్రపరిచినట్లు ఎంఇఓ 2 బిఎస్ఎన్ మూర్తి తెలిపారు. మండల కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈనెల 24 నుండి ప్రతిరోజూ ఉదయం 9:30 గంటల నుండి మధ్యాహ్నం 12.45 గంటల వరకు ఏడు రోజులపాటు పదో తరగతి సప్లమెంటరీ పరీక్షలు జరుగుతాయని తెలిపారు. 120 మంది విద్యార్థులు సప్లమెంటరీ పరీక్షలు రాయనున్నారు.

పోలీసుల అప్రమత్తత అవసరం : ఎస్‌పి

ప్రజాశక్తి-అనకాపల్లి : జూన్ ఒకటి నుంచి ఎగ్జిట్ పోల్స్, 4న సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడనున్న నేపథ్యంలో జిల్లాలో ఎలాంటి అవాంఛనీయమైన సంఘటనలు జరగకుండా జిల్లాలోని పోలీసు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్‌పి కెవి.మురళీకృష్ణ సూచించారు. ఆదివారం స్థానిక పోలీసు కార్యాలయంలో జిల్లా పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ ర్యాలీలు, ఊరేగింపులు, పండుగలలో స్టేజ్ ప్రోగ్రాములకు అనుమతులు లేవని, పెట్రోల్ బంకులలో లూజ్ పెట్రోల్ అమ్మకాలు అనుమతించకూడదని, బాణసంచా తయారీ, అమ్మకాలపై నిరంతరం నిఘా పెట్టాలని ఆదేశించారు. రౌడీ షీటర్లపై ప్రత్యేక నిఘా పెట్టి వారేమైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే జిల్లా నుంచి బహిష్కరించక తప్పదని హెచ్చరించారు. గ్రామాల్లో దాబాలు, హోటళ్లు, పాన్ షాప్‌లలో మద్యం అక్రమ అమ్మకాలు జరగకుండాచూడాలని, జూదం, కోడిపందేలు,కాయిన్ గేమ్, బెట్టింగ్ వంటి చట్ట విరుద్ధ చర్యలను అరికట్టాలని ఆదేశించారు.గ్రామాల్లో పోలీసు పికెట్, పెట్రోలింగ్ చెక్ పోస్టలను ప్రణాళికతో ఏర్పాటుచేసి అసాంఘిక చర్యలను నియంత్రించాలన్నారు. ఇలాంటివి ప్రోత్సహించే వారిని బైండోవర్ చేయాలన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌పి మురళీకృష్ణ

గ్రామస్థాయిలోని వివిధ వర్గాల ప్రజలతో సమావేశాలు నిర్వహించి, ఎన్నికల నియమావళి, 144సెక్షన్, 30 పోలీస్ యాక్ట్, బౌండ్ డౌన్ గురించి వివరించాలని, చట్ట ఉల్లంఘన జరిగితే ఎలాంటి చర్యలు ఉంటాయో ప్రజలకు వివరించాలన్నారు. నేరుగాగానీ, సామాజిక మాధ్యమాల్లోగానీ రెచ్చగొట్టే సందేశాలు, నిరాధార ఆరోపణలు చేస్తే కఠినచర్యలు ఉంటాయన్నారు. అనుమతి లేని ర్యాలీలు, ఊరేగింపులు,సమావేశాలు నిర్వహణ, బాణసంచా పేల్చడం నిషేధమని, అలాంటివి నిర్వహించినా, ప్రోత్సహించినా చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గత ఎన్నికల్లో నేరాలకు పాల్పడిన నిందితులపై నిఘా ఉంచాలన్నారు. అభ్యర్థుల గెలుపోటములపై బెట్టింగులు నిర్వహణ నేరమన్నారు. గ్రామాల్లో ఫ్లాగ్ మార్చ్‌లు, అనుమానాస్పద గ్రామాల్లో కార్డన్, సెర్చ్ ఆపరేషన్‌లు చేపట్టాలన్నారు. అపరిచిత వ్యక్తులపై నిఘా ఉంచాలన్నారు. తమ పరిధిలోని శాంతిభద్రతల పరిరక్షణ, నేరనియంత్రణపై జిల్లాలోని పోలీసు అధికారులు, సిబ్బంది పూర్తి నియంత్రణ ఉండి, వాటిని అరికట్టాలన్నారు. సమావేశంలో అదనపు ఎస్‌పిలు బి.విజయభాస్కర్, పి. సత్యనారాయణ రావు, అనకాపల్లి, పరవాడ, నర్సీపట్నం డిఎస్‌పిలు ఎస్.అప్పలరాజు, కె.వి.సత్యనారాయణ, జిఆర్ఆర్.మోహన్, డిటిసి డిఎస్‌పి డి.రామవర్మ, దిశ డిఎస్‌పి ఎం.ఉపేంద్రబాబు, ట్రైనీ డిఎస్‌పి భవ్య, ఇనస్పెక్టర్లు లక్ష్మణమూర్తి, చంద్రశేఖర్, అప్పలనాయుడు, కుమారస్వామి, గణేష్, సతీష్ , మన్మధరావు, ఎస్ఐలు రామారావు, రఘువర్మ, బి.తేజేశ్వరరావు పాల్గొన్నారు.

బకాయిలను తక్షణమే చెల్లించాలి

మాట్లాడుతున్న విశ్రాంత ఉపాధ్యాయుల సంఘం రాష్ట్ర కార్యదర్శి

ప్రజాశక్తి-అనకాపల్లి : ఉపాధ్యాయులు, విశ్రాంత ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన బకాయిలను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని విశ్రాంత ఉపాధ్యాయుల సంఘం రాష్ట్ర కార్యదర్శి బుద్ద కాశీ విశ్వనాథం డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక పిఆర్‌టియు కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. ఏళ్ల తరబడి బకాయిలు చెల్లించక ప్రభుత్వం కాలయాపన చేస్తుందన్నారు. 2018 నుంచి గ్రాట్యూటీ, పిఆర్‌సి, డి ఎ బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు. 2022 తర్వాత పదవి విరమణ పొందిన వారికే వీటిని అమలు చేయడం దారుణమన్నారు. క్వాంటం ఆఫ్ పెన్షన్ ఇతర రాష్ట్రాల్లో మాదిరిగానే పది శాతం పెంచాలన్నారు. బోధనేతర విధుల నుంచి ఉపాధ్యాయులను తప్పించాలన్నారు. నాడు నేడు పనులను ఇంజనీరింగ్ అధికారులకు అప్పగించాలన్నారు. అన్ని పనులకు ఉపాధ్యాయులను బాధ్యులను చేస్తూ కక్ష సాధింపు చర్యలకు పాల్పడడం సరికాదన్నారు. సమావేశంలో సంఘ ప్రతినిధులు వరం, కామేశ్వరరావు, మూర్తి, గంగాధర్, జనార్ధన్, రమేష్, సత్యనారాయణ పాల్గొన్నారు.

కంటి వ్యాధులపై అవగాహన

డాక్టర్ పరమేశ్వరరావును సత్కరిస్తున్న వాకర్స్ క్లబ్ సభ్యులు

ప్రజాశక్తి- అనకాపల్లి : కంటి వ్యాధులు, వాటి నివారణ, నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రముఖ నేత్ర వైద్యులు డాక్టర్ పరమేశ్వరరావు అవగాహన కల్పించారు. ఆదివారం స్థానిక ఎన్‌టిఆర్ మార్కెట్ యార్డ్ గుమస్తాల సంఘం కార్యాలయంలో వాకర్స్ క్లబ్ సర్వసభ్య సమావేశం జరిగింది.ఈ సందర్భంగా 40 మంది వాకర్స్ సభ్యులకు కంటి సమస్యలపై అవగాహన కల్పించారు. అనంతరం డాక్టర్ పరమేశ్వరరావును సత్కరించారు. వాకర్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు, కోశాధికారి బీశెట్టి రామకృష్ణ, యల్లపు సాంబశివరావు(శివ), రాపేటి నారాయణరావు, డాక్టర్ డిడి నాయుడు, ఆడారి మల్లికార్జున రావు, బివి రమణ, నల్లాల దేముళ్లు, కెవి గౌరీపతి, కెవివి సత్య నారాయణ, ఆళ్ల ఓంరాం, డిఎస్ఎన్ మాణిక్యాలరావు, కె.వీరభద్ర రావు, టిఎస్ అప్పారావు, దాడి స్వామి నాయుడు పాల్గొన్నారు.

జీవాల మందలతో భూసారానికి మేలు

పొలాల్లో కాసిన గొర్రెల మందలు

ప్రజాశక్తి- కె.కోటపాడు : సేంద్రియ వ్యవసాయానికి పొలాల్లో గొర్రెలు, మేకల మందలు కాయడం పట్ల రైతులు మక్కువ చూపిస్తున్నారు. రసాయన ఎరువులు వాడకం వల్ల పంటపొలాలలోని భూసారం క్షీణించిపోతున్న పరిస్థితుల్లో చౌకగా ప్రకృతి సిద్ధంగా లభించే గొర్రెలు మేకల మందలను పొలాల్లో కాపు కాయడం ద్వారా పొలాల్లో సారాన్ని పరిపుష్టి అవుతుందని రైతులు అంటున్నారు. ఏటా వేసవి సీజన్‌లో జీవాల మందలతో ఈ ప్రాంతానికి వచ్చే వారికి సరిపడే బియ్యం నిత్యవసర వస్తువులతో, నామమాత్రపు డబ్బులు ఇస్తే సంతృప్తి చెందే జీవాల పెంపకందారులు రైతులు కోరిన పొలాల్లో మందలు వేస్తున్నారు. పలు రైతులు కూడా తమ పొలాల్లో గొర్రెలు మందలను కాపు కాసేందుకు సిద్ధపడుతున్నారు

నిరుపేదల జీవితాల్లో వెలుగులు నింపిన 'పీలా'

వెంకటజగ్గారావుకు ఘననివాళి

మాట్లాడుతున్న మాజీ మంత్రి వీరభద్రరావు

ప్రజాశక్తి-అనకాపల్లి : ఎటువంటి అధికార పదవులు లేకపోయినా ఎంతో మందికి ఉపాధి కల్పించి నిరుపేదల జీవితాల్లో వెలుగులు నింపిన మహనీయుడు పీలా వెంకట జగ్గారావు (పివిజెఆర్) అని పలువురు వక్తలు కొనియాడారు. ఆదివారం స్థానిక గౌరీ గ్రంథాలయంలో నూకాంబికా దేవస్థానం మాజీ ఛైర్మన్, వ్యాపారవేత్త, స్వచ్ఛంద సేవకులు పీలా వెంకట జగ్గారావు (పీవీజెఆర్) సంతాప సభ నిర్వహించారు. పీలా వెంకటజగ్గారావు చిత్రపటానికి మాజీమంత్రి దాడి వీరభద్రరావు, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు, పలువురు నేతలు పట్టణ ప్రముఖులు, ప్రజలు పూలమాలలు వేసి ఘనంగా శ్రద్ధాంజలి ఘటించారు. జగ్గారావుతో ఉన్న అనుబంధాన్ని అందరూ నెమరువేసుకున్నారు.ఈ సందర్భంగా దాడి వీరభద్రరావు మాట్లాడుతూ నిరుద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపిన మహనీయులు పీవీజెఆర్ అని కొనియాడారు. క్రీడలపట్ల ఎంతో ఆసక్తి గల ఆయన చిన్నతనంలో తనకు లభించని ఆటలాడే అదృష్టాన్ని నేటి యువతకు, బాలలకూ అందుబాటులోనికి తేవటానికి తన వంతు సాయం అందించేవారన్నారు. మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు మాట్లాడుతూ చిన్నతనం నుంచీ ఆర్థిక సమస్యలు, కష్టాలు తెలిసిన వ్యక్తిగా ఆపద్భమయాలలో పిలవకనే పలికే పేదల పెన్నిది పీలా వెంకట జగ్గారావు కీర్తి సాధించారని అన్నారు. జగన్నాథస్వామి దేవస్థానం మాజీ ఛైర్మన్ దాడి ఈశ్వరరావు మాట్లాడుతూ వాణిజ్య ప్రముఖునిగా, స్వచ్ఛంద సేవకునిగా, పేద ప్రజలకు తోడునీడగా ఉన్న జగ్గారావు ఉన్నతస్థాయికి చేరుకోవడానికి చేసిన కృషి, దీక్ష, పట్టుదల నేటి యువతకు ఆదర్శప్రాయమన్నారు. కార్యక్రమంలో గౌరీ గ్రంథాలయ కార్యదర్శి కాంగ్రేగుల వెంకటరమణ, అధ్యక్షుడు దొడ్డి నూకఅప్పారావు, మాజీ కార్యదర్శి మళ్ల బాపునాయుడు, సినీ నిర్మాత పీలా తిలక్ పాల్గొన్నారు.

160 మందికి కంటి పరీక్షలు

కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

ప్రజాశక్తి- కశింకోట : విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి సౌజన్యంతో అనకాపల్లి జిల్లా అందత్వ నివారణ సంస్థ సారథ్యంలో అనకాపల్లి జిల్లా హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ మధు సత్యశ్రీ ఆధ్వర్యంలో ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని కశింకోట హైస్కూల్‌లో నిర్వహించారు. ఏపి హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ వ్యవస్థాపక సెక్రెటరీ ఎం శ్యాంప్రసాద్, స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ ఎస్‌వి రమణ ప్రారంభించిన వైద్యశిబిరంలో 160 మందికి కంటి పరక్షలు చేశారు వీరిలో 90 మందిని కంటి ఆపరేషన్‌కు ఎంపిక చేసి విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రికి తరలించారు. పుట్టా మురళీకృష్ణ, రాజు, పుట్టా రవి, కలగా శివనాయుడు, సురేష్, శంకర్ ఫౌండేషన్ ఇంచార్జ్ అరుణ్ పాల్గొన్నారు.

సామాజిక పరిస్థితులను ప్రతిబింబిస్తున్న నాటికలు

ప్రజాశక్తి -అనకాపల్లి : అనకాపల్లి గవరపాలెం వివి రమణ రైతు భారతి ఓపెన్ ఆడిటోరియంలో మూడు రోజులుగా జ్యోతి సరళ స్మారక కళాపరిషత్తు నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి తృతీయ నాటికల ప్రదర్శనలు నేటి సామాజిక పరిస్థితులకు అద్దం పట్టేలా ఉన్నాయి. జరుగుతున్న సంఘటనలను కళ్లకు కట్టినట్టుగా చూపిస్తుండడంతో ప్రేక్షకులు హర్షిస్తున్నారు. రాష్ట్ర స్థాయి పోటీలలో భాగంగా ఆదివారం మొదటి ప్రదర్శన అభినయ విశాఖపట్నం వారి కాశీవాసి రావయ్య, రెండవ ప్రదర్శనగా విజయవాడ హర్ష క్రియేషన్స్ వారి మనస్సాక్షి ఎంతో ఆకట్టుకున్నాయి.
మానవత్వం విలువలు లోపిస్తున్న నేటి సమాజంలో ఎవరి తలకు వాళ్లే కొరివి పెట్టుకునే రోజు వస్తుందని ఊహించి ఈరోజే రాసిన నాటిక ఓ కాశీ వాసి రావయ్య. తండ్రి కొడుకుల్ని వేరు చేయడానికి ఒక కోడలు దురుద్దేశంతో అన్న మాటలు చేష్టలతో చేతలుడికిన ఆ వృద్ధుడు చేసుకున్న ఆత్మాహుతి, అనంతరం అతని అస్థికలను తీసుకెళ్లేందుకు

నాటికలో ఒక సన్నివేశం

కూడా ఇష్టపడని కొడుకును చూసి కాటి కాపరి కాశీకి తీసుకువెళ్లిన దృశ్యం ప్రేక్షకులను ఆలోచింపజేసింది. డబ్బు బంగారంపై ఉన్న ప్రేమ కనీసం సాటి మనిషిగా నైనా చూడని కథాంశం ఆకట్టుకుంది.
ఇక డాక్టర్ పి బ్రహ్మానందం రచించి, కత్తి శ్యాం ప్రసాద్ దర్శకత్వం వహించిన రెండో నాటిక ప్రదర్శించిన మనస్సాక్షి ఇతివృత్తాన్ని పరిశీలిస్తే ప్రతి మనిషికి మనస్సాక్షి ఉంటుంది. అది కుటుంబ సంస్కృతి సాంప్రదాయాల, సంస్కారం వలన రూపు దిద్దుకుంటుంది. అయితే ఈ నాటికలో చంద్రశేఖర్ పాత్ర తన మనస్సాక్షికే భిన్నంగా ధనార్జనే జీవిత ధ్యేయంగా అక్రమంగా డబ్బు సంపాదిస్తాడు. అదే పందేలు తన కొడుకు కూడా వ్యవహరించి తండ్రికి కీడు చేస్తాడు. దీంతో చంద్రశేఖర్ పశ్చాత్తాప పడి డబ్బు శాశ్వతం కాదనే నిర్ణయానికి వస్తాడు. మనిషికి కావలసింది పిడికెడు మెతుకులు, బారెడు గుడ్డ, ఆరడుగుల స్థలం మాత్రమే శాంతిని ఇస్తుందనే సందేశాన్నిచ్చే నాటిక మనస్సాక్షి. నిర్వాహకులను ప్రజలు అభినందిస్తున్నారు.

వర్షంతో ఉపశమనం

ప్రజాశక్తి- బుచ్చయ్యపేట : కొద్ది రోజులుగా ఎండవేడిమికి విలవిలలాడిన ప్రజానీకానికి వాతావరణం చల్లబడడంతో ఉపశమనం పొందుతున్నారు. మండలంలో ఆదివారం మధ్యాహ్నం ఓమోస్తరు వర్షం కురిసింది. సాయంత్రం వరకు చిరుజల్లులు కురవడంతో వాతావరణం పూర్తిగా చల్లబడింది. ప్రస్తుతం కురిసిన వర్షం వేసవి దుక్కులకు, చెరకు నాట్లుకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని రైతులు అంటున్నారు. వర్షంతో వాతావరణం చల్లబడడంతో వేసవి తాపం నుంచి ఊరట పొందారు.

ఉత్సాహంగా వేసవి విజ్ఞాన శిబిరం

ప్రజాశక్తి- సబ్బవరం : స్థానిక శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరం ఉత్సాహంగా సాగుతోంది. గ్రంథాలయాధికారి వి.కుమారి శిరీష ఆధ్వర్యంలో. శిక్షణ శిబిరంలో ఆదివారం విద్యార్థులకు నీతి కథలు బోధించడం, చదవడం, ఆటలు నేర్పించినట్లు తెలిపారు. వచ్చేనెల 7వ తేదీ వరకు శిబిరం కొనసాగుతుందని లైబ్రేరియన్ శిరీష తెలిపారు.

నక్కపల్లి జంక్షన్.. టెన్షన్..

- హైవేపై వాహనాలు రద్దీ
- రోడ్డు దాటాలంటే భయం..
- నిత్యం ప్రమాదాలు

భయపడుతూ రోడ్డు దాటుతున్న పాదచారులు

ప్రజాశక్తి-నక్కపల్లి:నక్కపల్లి జాతీయ రహదారిపై రెండు ప్రధాన జంక్షన్‌లలో రోడ్డు దాటాలంటే భయం భయంగా మారింది. ఎప్పుడు వాహనాల రాకపోకల రద్దీతో జాతీయ రహదారి ఉండటంతో రోడ్డు దాటాలంటే జనం హడలి పోతున్నారు. నక్కపల్లి జాతీయ రహదారిపై ఉపమాక వెళ్లే ఆర్చి జంక్షన్, కాంప్లెక్స్ కూడలి జంక్షన్ లు ప్రమాదాలకు నిలయంగా మారాయి.

నక్కపల్లి చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు రాకపోకలు సాగించాలంటే బస్సు ఎక్కేందుకు నక్కపల్లి రావాల్సిందే. కూలి పనులు, వివిధ వృత్తులు చేసుకునేవారు, విద్యార్థులు, ప్రయాణికులు రెండు జంక్షన్‌ల వద్ద రోడ్డు దాటాలంటే వణికి పోతున్నారు. ప్రాణాలను గుప్పెట్లో పెట్టుకుని రోడ్డు దాటిన తర్వాత హమ్మయ్య అని అనుకుంటున్నారు. చీకటి పడితే ఆ సమయంలో రోడ్డు దాటాలంటే సాహసమనే చెప్పాలి. విశాఖ వైపు వెళ్లే మార్గంలో ప్రయాణికులు బస్సు ఎక్కాలంటే రోడ్డు దాటాల్సిన పరిస్థితి నెలకొంది.విద్యార్థులు ఎలమంచిలి వైపు బస్సు ఎక్కాలంటే రోడ్డు దాటి ఎక్కవలసి వస్తుంది. కాంప్లెక్స్ ఉన్నప్పటికీ బస్సులు కాంప్లెక్స్ లోకి రాలేదు. దీంతో తప్పని పరిస్థితితో భయపడుతూ రోడ్డు దాటవలసి వస్తుంది. రోడ్డు దాటే సమయంలో ఇప్పటికే అనేక ప్రమాదాలు చోటుచేసుకున్నాయి.

రోడ్డుపై నిలిపివేసిన ఆటో

హైవేపై అడ్డంగా ఆటోలు

ముఖ్యంగా ఉపమాక వెళ్లే ఆర్చి జంక్షన్ అత్యంత ప్రమాదకరంగా ఉంది. ఉపమాక మార్గం గుండా బైకులు, ఇతర వాహనాలు హైవే ఎక్కే సమయంలో అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి. ఉపమాక ఆర్చి జంక్షన్ వద్ద హైవేపై ప్రయాణికులను ఎక్కించుకునేందుకు ఆటోలు రోడ్డుపై అడ్డంగా నిలుపుదల చేయడంతో ఉపమాక మార్గం గుండా వచ్చే బైక్ లు, ఇతర వాహనాలు రోడ్డుపై జీబ్రా లైన్ దాటి మార్గ మధ్యలోకి రావలసి వస్తుంది. ఈ సమయంలో వెనుక నుంచి వచ్చే వాహనాలు ఢీకొంటున్నాయి. ఇప్పటికే ఈ జంక్షన్‌లో అనేక రోడ్డు ప్రమాదాలు జరిగాయి. అనేకమంది మృత్యువాత పడిన సంఘటనలు కూడా ఉన్నాయి. ప్రమాదాలను దృష్టిలో పెట్టుకుని ముఖ్యంగా ఉపమాక ఆర్చి జంక్షన్ వద్ద హైవేపై ఆటోలను నిలుపుదల చేయకుండా పోలీసులు చర్యలు చేపట్టవలసిన అవసరం ఎంతైనా ఉంది.

ఉపమాక ఆర్చి జంక్షన్ వద్ద రోడ్డు దాటుతున్న వాహనదారులు

జాతీయ రహదారిపై నిత్యం వాహనాల రద్దీ పెరిగింది. దానికి తోడు స్పీడు నియంత్రణ లేకుండా పోయింది. కనీసం జంక్షన్‌ల వద్ద కూడా వాహనాలు స్పీడ్ తగ్గించని పరిస్థితి నెలకొంది. రెండు జంక్షన్‌ల వద్ద అప్పుడప్పుడు పోలీసులు ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపడుతున్నారు. పోలీసులు ఉన్న సమయంలో జంక్షన్ వద్ద ఆటోలు నిలుపుదల చేయకుండా, వాహనాల రద్దీ లేకుండా చర్యలు చేపడతారు. ప్రమాదాలను దృష్టిలో పెట్టుకొని అప్పుడప్పుడు కాకుండా ప్రతిరోజు రెండు ప్రధాన జంక్షన్‌ల వద్ద ట్రాఫిక్ పోలీస్ లను నియమించి ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టాలని, అదేవిధంగా నక్కపల్లి జాతీయ రహదారిపై సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

చంద్రబాబుకు పుష్పగుచ్చం అందజేస్తున్న అనిత

చంద్రబాబును కలిసిన అనిత

ప్రజాశక్తి -నక్కపల్లి:తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును శనివారం హైదరాబాద్‌లో ఆ పార్టీ పోలిట్ బ్యూరో సభ్యురాలు, పాయకరావుపేట నియోజకవర్గం కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వంగలపూడి అనిత మర్యాద పూర్వకంగా కలిసి పసుపుగుచ్చం అందజేశారు. పాయకరావుపేట నియోజకవర్గంలో పోలింగ్ సరళి, అనుకూల ఓటింగ్, పోలింగ్ శాతాన్ని పరిగణలోకి తీసుకుని తాను విజయం సాధిస్తానని ఆమె చంద్రబాబుకు వివరించారు.కూటమి నాయకులు , కార్యకర్తలు అహర్నిశలు కష్టించి పని చేశారని ఆమె బాబు దృష్టికి తీసుకువెళ్లారు.

హాకీ శిక్షణ శిబిరాన్ని వినియోగించుకోవాలి

ప్రజాశక్తి -నక్కపల్లి :నక్కపల్లి హాకీ క్రీడా మైదానంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న సమ్మర్ హాకీ శిక్షణ క్యాంప్‌ను హాకీ క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా స్పోర్ట్స్ అథారిటీ అధికారి వెంకటరమణ కోరారు. కోచ్ రాంబాబు పర్యవేక్షణలో ప్రతిరోజు ఉదయం 5 గంటల నుంచి 7 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటల వరకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. క్రీడాకారులకు హాకీలో ప్రత్యేకత తర్ఫీదును ఇవ్వడం జరుగుతుందన్నారు. బియస్ హాకీ ఫౌండర్ సూరిబాబు, అధ్యక్షులు చిన్న అప్పారావు, కార్యదర్శి తాతాజీ, నానాజీ, రామచంద్రరావు, దాతల ఆధ్వర్యంలో ప్రతిరోజు క్రీడాకారులకు అల్పాహారం అందిస్తున్నామన్నారు. క్రీడాకారులకు కావలసిన క్రీడా సామాగ్రిని కూడా దాతల సహాయంతో అందిస్తున్నట్లు తెలిపారు. నెల రోజుల పాటు నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపును క్రీడాకారులు వినియోగించుకోవాలన్నారు.

సన్మానిస్తున్న నాయకులు

కళాకారులకు ఘన సన్మానం

ప్రజాశక్తి-హుకుంపేట:మండల కేంద్రంలో స్వరాజ నట రంజని మ్యూజికల్ ఆర్కెస్ట్రా కళాకారులను జిల్లా కళాకారుల సంక్షేమ సేవా సంఘం, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు తాపుల క్రిష్ణారావు, లింగమూర్తిలు సన్మానించారు.ఈ సందర్భంగా కళాకారుల బృందం సభ్యులు అభినం దనలు తెలియ జేసారు. ఈ కార్య క్రమంలో గిరిజన కళాకారుల సంక్షేమ సేవా సంఘం నాయకులు డూరు కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌టిఆర్ స్టేడియంలో శిక్షణ

ప్రజాశక్తి-అనకాపల్లిడెస్క్:నర్సీపట్నం ఎన్టీఆర్ స్టేడియంలో నింజాస్ అకాడమీ ఆధ్వర్యంలో సమ్మర్ క్యాంపు కొనసాగుతుంది. అకాడెమీ డైరెక్టర్స్‌లు సుతాపల్లి శ్రావణ్, వెలగా జగన్నాథ్, పారుపల్లి శ్రీనివాస్, సీనియర్ కోచ్ శేఖర్, ఎన్ఐఎస్ మహిళా కోచ్‌లు కృష్ణవేణి, ప్రియాంకతో పాటు 70 మంది క్రీడా కారులు పాల్గొన్నారు. కరాటే, బాక్సింగ్, యోగా, కిక్ బాక్సింగ్, వాలీబాల్, షటిల్, చెస్, కేరమ్స్ వంటి ఇండోర్ గేమ్స్ వాటిలో శిక్షణ ఇస్తున్నారు. చెట్టుపల్లి, గొలుగొండ, మాకవరపాలెంలో కూడా క్యాంప్‌లు జరుగుతున్నాయని శాప్ కోచ్ అబ్బు తెలిపారు.

తాగునీటి సమస్యపై

గిరిజనుల వినూత్న నిరసన

ప్రజాశక్తి -అనంతగిరి:తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ గిరిజన ప్రజలు ఖాళీ బిందెలతఓ వినూత్న రీతిలో చేతులు జోడించి మండలంలోని రొంపల్లి పంచాయతీ ఎగువగుడ్డి, గాదిలోవ గ్రామాల గిరిజన ప్రజలు ఆదివారం ఆందోళన చేపట్టారు. తాగునీటి సమస్యతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించి సమస్య పరిష్కరించాలని పలు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వార్డు మెంబర్ సోమ్మెల అప్పలరాజు, రైతు సహకార సంఘం ప్రతినిధులు కె. సింహాచలం, కె.సన్యాసిరావు మాట్లాడుతూ, తాగునీటి సౌకర్యం లేక మండుటెండల్లో సుదూర ప్రాంతంలో ఉన్న కలుషితమైన గెడ్డ నీటిని ఆశ్రయించవలసిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. తక్షణమే తమ గ్రామాలకు పైపులైన్ లేదా బోరు బావుల ద్వారా తాగునీటి సరఫరా చేయలని వారు డిమాండ్ చేశారు. ఎర్రబోయిన వీధి నుండి ఎగ్గువగుడ్డి గ్రామానికి పైపులైన్ ఏర్పాటు చేసి మూడు టేప్‌లు ఏర్పాటు చేశారని, మరమ్మతుకు గురి కావడంతో కిలోమీటర్ దూరంలో ఉన్న గెడ్డకు వెళ్లి కలుషితమైన నీటిని తెచ్చుకొని ఆశ్రయించవలసిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పి.సన్యాసమ్మ తదితరులు పాల్గొన్నారు.

నినాదాలు చేపడుతున్న మహిళలు

కొనసాగిన వేసవి శిక్షణ శిబిరాలు

-పలు విజ్ఞానదాయక కార్యక్రమాలు

గొలుగొండలో మాట్లాడుతున్నరాజుబాబు

ప్రజాశక్తి-అనకాపల్లిడెస్క్:నర్సీపట్నం శాఖా గ్రంధాలయంలో గ్రంధాలయదికారి పీ.దమయంతి ఆధ్వర్యంలో ఆదివారం సమ్మర్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలతో కథలు చదివించారు. విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు పి.ప్రభాకర్ స్నేహం విలువ తెలియచేసిన కథను పిల్లలకు చెప్పారు. అనంతరం పిల్లలతో దేశ భక్తి గీతాలు పాడించారు. చివర్లో రిక్రియేషన్ గేమ్ ఆడించారు.

గొలుగొండ:స్థానిక శాఖా గ్రంధాలయంలో గ్రంధాలయాధికారి రాజుబాబు ఆధ్వర్యంలో వేసవి శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ మేరకు ఆదివారం బుక్ రీడింగ్, స్టోరీ టెల్లింగ్ వంటి కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా రాజుబాబు మాట్లాడుతూ, విద్యార్థులు వేసవి శిక్షణ శిబిరంను సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నర్సీపట్నంలో మాట్లాడుతున్న దమయంతి

నూతన అంగన్‌వాడీ కేంద్రం

ప్రారంభానికి నోచని అంగన్వాడీ కేంద్రం

ప్రజాశక్తి -కోటవురట్ల:మండల కేంద్రంలో పోలీస్ స్టేషన్ సమీపంలో నిర్మించిన అంగన్వాడీ కేంద్రం ప్రారంభానికి నోచుకోలేదు. సుమారు రూ.6 లక్షలతో నిర్మించిన ఈ కేంద్రాన్ని దాదాపు ఏడాదికాలంగా ప్రారంభించక పోవడంతో ఆయా ప్రాంతాల చిన్నారులు, సిబ్బంది తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ప్రస్తుతం ఆ ప్రాంతానికి సంబంధించి కేంద్రాన్ని అద్దె కొంపలో కేంద్రాన్ని నడుపుతున్నారు. నిర్మాణం పూర్తి చేసుకుని అన్ని హంగులతో ముస్తాబైనా ప్రారంభించకపోవడం విశేషం.

ఈ విషయమై సమగ్ర శిశు అభివృద్ధి శాఖ సూపర్వైజర్ కనకదుర్గను వివరణ కోరగా గుత్తేదారునికి బిల్లు చెల్లించక పోవడంతో తాళాలు ఇవ్వలేదన్నారు. దీంతో అంగన్వాడి కేంద్రాన్ని ప్రారంభించలేదని తెలిపారు.

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయం

సహకారం లేని 'సంఘం'

-సభ్యుల నిధి కోటి రూపాయలు

- ఏటా 60 లక్షల ఆదాయం

- కేవలం వ్యవసాయ రుణాలతో సరి

ప్రజాశక్తి -కోటవురట్ల:మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ప్రధాన కూడలిలో అలంకార ప్రాయంగా దర్శనమిస్తుంది తప్ప రైతులకు ఎటువంటి సహాయ సహకారాలు సంఘం అందించలేక పోతోంది.మండల వ్యాప్తంగా 25 గ్రామ పంచాయతీలకు గాను 5000 మంది వరకు సభ్యులు ఉండటంతో సభ్యుల నుండి సభ్యత్వం పేరుతో దాదాపు కోటి రూపాయల వరకు నిధులు ఉన్నాయి. సంఘం గతంలో సంఘ సభ్యులకు వివిధ రకాల రుణాలు పరికరాలు, ఎరువులు, విత్తనాలు వ్యక్తిగతంగా పశువుల రుణాలు అందజేసేవారు. ప్రస్తుతం సంఘం కేవలం ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ రుణాలకు మాత్రమే పరిమితమైంది.

ఏటా సభ్యులకు ప్రభుత్వం అందిస్తున్న రుణాలు సుమారు 12 కోట్ల వరకు సభ్యులకు అందజేస్తున్నామని, దాదాపు 2000 వరకు రైతులు రుణాలు తీసుకోవడం జరుగుతుందని కార్యదర్శి రామకృష్ణ తెలిపారు. రైతుల నుంచి ఏడు శాతం వడ్డీ వసూలు చేయడం జరుగుతుందని, లక్ష రూపాయలు దాటితే మూడు శాతం మాత్రమే వడ్డీ వసూలు చేస్తామన్నారు.సకాలంలో రుణం చెల్లించిన వారికి ప్రభుత్వం వడ్డీ రాయితీ అందిస్తుందన్నారు. ఎటా వడ్డీ రూపేనా సంఘానికి 60 లక్షల వరకు ఆదాయం లభిస్తుందన్నారు. సహకార సంఘానికి ఎదురుగా మూడు షాప్ నిర్మాణం చేపట్టడంతో పాటు, షాప్ ల నుంచి వచ్చే ఆదాయం ఏటా 60 వేల వరకు ఉందని, వారి వద్ద నుంచి డిపాజిట్ రూపేనా దాదాపు 2.50 లక్షలు వసూలు చేసామన్నారు.

21, 22 తేదీల్లో కౌన్సెలింగ్

ప్రజాశక్తి-పాడేరు: అల్లూరి జిల్లా పాడేరు ఐటిడిఏ పరిధిలోని గిరిజన సంక్షేమ గురుకుల కళాశాలలో ఇంటర్ అడ్మిషన్లకు ఆన్లైన్లో దరఖాస్తులు చేసుకున్న విద్యార్థిని విద్యార్థులకు ఈ నెల 21, 22 తేదీల్లో కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్లు ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి వి అభిషేక్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకున్న ఆభ్యర్థులు పాడేరు గురుకుల కళాశాలలో జరిగే కౌన్సిలింగ్ కు 21న బాలురు, 22న బాలికలు హాజరు కావాలని సూచించారు.

సుందరయ్యకు ఘన నివాళి

ప్రజాశక్తి కార్యాలయంలో సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేస్తున్న వెంకటేశ్వరరావు

నక్కపల్లిలో సుందరయ్య చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి -యంత్రాంగం

పీడిత ప్రజల ప్రియతమ నేత, దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని అనకాపల్లి, విశాఖ జిల్లాల్లోని పలుచోట్ల ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన అందించిన సేవలను పలువురు నాయకులు కొనియాడారు.

తగరపువలస : స్థానిక సిఐటియు కార్యాలయం వద్ద సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం భీమిలి జోన్ నాయకులు రవ్వ నరసింగరావు, ఎస్.అప్పలనాయుడు, కర్రి రాము, జీరు సత్యారావు, కానూరి రమణ, ఆనంద్, సూరి బాబు, సన్యాసప్పడు తదితరులు పాల్గొన్నారు.

ములగాడ : సిపిఎం మల్కాపురం జోన్ కమిటీ

ఆరిలోవలో...

జోన్ కార్యదర్శి వి.నరేంద్రకుమార్, నాయకులు జి.ప్రియాంక, నాగరాజు, రమణ తదితరులు పూలమాలవేసి నివాళులర్పించారు.

గాజువాక : 70వ వార్డు పరిధి దశమికొండలో సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. పి.నర్సింగరావు అధ్యక్షతన జరిగిన సభలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.పద్మ, గాజువాక జోన్ కార్యదర్శి ఎం.రాంబాబు, పి.శేషారత్నం, పి.కోటేశ్వరరావు, బివి.నాగేశ్వరావు, రాజు, దాలినాయుడు, మంగ పాల్గొన్నారు.

జివిఎంసి 68వ వార్డు పరిధి అక్కిరెడ్డిపాలెంలో సుందరయ్య వర్ధంతిని నిర్వహించారు. ఆర్‌కెఎస్‌వి.కుమార్, జె.కోటేశ్వరరావు, ఎ.లోకేష్, సుబ్బన్న, శ్రీలక్ష్మి, వై.లక్ష్మి, వైఆర్.ఆంజనేయులు, మల్లేష్, గోపాలరావు పాల్గొన్నారు.

ఉక్కునగరం : ఉక్కునగరంలోని సిఐటియు కార్యాలయంలో స్టీల్ సిఐటియు ఆధ్వర్యాన సుందరయ్య వర్ధంతిని నిర్వహించారు. సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో స్టీల్ సిఐటియు అధ్యక్షులు వైటి.దాస్, నాయకులు కెపి.సుబ్రహ్మణ్యం, కె.బాలశౌరి, మొహిద్దిన్, సత్యనారాయణ, పుల్లారావు, శ్రీరామచంద్రమూర్తి, సూర్యనారాయణ, టి చిరంజీవి, శాంత రాజ్, దొర, ఆర్ వెంకట్రావు, కెఆర్‌కె రాజు, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు పి.రాము, కార్మికులు పాల్గొన్నారు.

గాజువాక : ఆటోనగర్‌లోని ప్రజాశక్తి విశాఖ ఎడిషన్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో సుందరయ్య చిత్రపటానికి సంస్థ జనరల్ మేనేజర్ ఎం.వెంకటేశ్వరరావు

కొత్తకోటలో...

పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోడీ హయాంలో రాజ్యాంగంపై తీవ్రమైన దాడి జరుగుతోందన్నారు. ప్రజాస్వామ్య హక్కులు హరించబడుతున్నాయని తెలిపారు. సుందరయ్య స్ఫూర్తితో రాజ్యాంగ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కంకణబద్ధులు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రజాశక్తి జిల్లా సమన్వయ కమిటీ సభ్యులు వై.సత్యనారాయణ, కె.అప్పలనాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

నక్కపల్లి:స్థానిక సిఐటియు కార్యాలయంలో పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధింతిని ఘనంగా ఆదివారం నిర్వహించారు. ముందుగా సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం అప్పలరాజు మాట్లాడుతూ, ప్రజల నిరంతర అలుపెరుగని పోరాటం చేశారన్నారు. ఆయన ఆశయాల కోసం యువత కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఎం.రాజేష్, ఎం.నానాజీ, ఆటో యూనియన్ నాయకులు అడ్డూరి వెంకన్న, వెంకటరమణ, కె. అప్పారావు, బాబ్జి, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

మండలంలోని మత్స్యకార గ్రామమైన రాజయ్యపేటలో పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతిని సిపిఎం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు,

భీమిలిలో..

మండల కార్యదర్శి రాజేష్, నాయకులు గోసల సోమేశ్వరరావు, పి.రమణ పాల్గొన్నారు.

మాడుగుల: మండలంలోని వొమ్మలి గ్రామంలో సుందరయ్య చిత్రపటానికి వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి కార్లే భవాని పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

కొత్తకోట:రావికమతం మండలం చీమల పాడు శివారు అజయ్‌పురం గ్రామంలో సుందరయ్య చిత్రపటానికి సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కె.గోవిందరావు, పాంగి చంద్రయ్య తదితరులు పూలమాల వేసి ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా గోవిందరావు మాట్లాడుతూ, చట్టసభలకు సైకిల్ పై వెళ్లిన నిరాడంబరులు సుందరయ్య అని కొనియారు. ఈ కార్యక్రమంల పాంగి విజయ్ కుమార్, వంతల చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

ఆధ్వర్యాన 59వ వార్డు నెహ్రూనగర్, 62వ వార్డు పరిధి దుర్గానగర్, 63వ వార్డు పరిధి క్రాంతినగర్, చింతల్లోవలో సుందరయ్య చిత్రపటాలకు సిపిఎం నాయకులు ఆర్.లక్ష్మణమూర్తి, జోన్ కార్యదర్శి పి.పైడిరాజు, పొన్నాడ రామారావు, క్రాంతినగర్ గ్రామసంఘం అధ్యక్షులు కె.పరదేశినాయుడు పూలమాలలువేసి నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో కె.పెంటారావు, ఆర్.విమల, పి.సురేష్, గోపాల్, కె.రాము, దుర్గాప్రసాద్, ఆదినారాయణ, నరేష్, వి.నీలయ్య, హరి, సత్తిబాబు, బి.అర్జునరావు, గణేష్, వై.గంగాధర్, బి.శ్రీను, రాజేష్, రాజు, సూరిబాబు, డి.రాము, పైడినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆరిలోవ : పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతి సభను ఆరిలోవ బిఎన్ఆర్.నగర్‌లో ఘనంగా నిర్వహించారు. సుందరయ్య చిత్రపటానికి సిపిఎం ఆరిలోవ

మాడుగులలో...

మల్కాపురంలో...